# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 22-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:272 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

నాడీ మండల వ్యాధుల
పీడనకు గురైన ప్రజల వేదన దీర్చన్
మోడీ ప్రతినిధిగ కిషను
నేడే హాస్పిటలు తెరిచె నిజసేవ లిడన్ !!

(నాడీ మండల వ్యాధుల బాధితులకు వైద్యం అందించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ లో ప్రత్యేకంగా హాస్పిటల్ లోఒక వార్డు ప్రారంభించారు. ప్రపంచ మొత్తం లోనే ఇది మొదటిది అని నిర్వాహకులు తెలిపారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సీజేపి ఆందోళన
చిలికి చిలికి గాలివాన
పరిణమించే ఆగ్రహం
ప్రవాహంగా ఢిల్లీలోనా.
నీట్ పేపర్ లీకేజీలో
నిర్లక్ష్యం విద్యామంత్రి
రాజీనామా డిమాండ్
రగులుకునే రణతంత్రి.



-వేల్పుల నారాయణ
9440433475

## విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం జరగనివ్వబోం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జులై 21:నీట్ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ లీక్ కారకులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్నామని, నిందితులను జైల్లో పెట్టామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు నష్టం కలగకుండా రీనీట్ నిర్వహించామని తెలిపారు. ఈరోజు(మంగళవారం) ఢిల్లీలో ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ప్రధాని మోదీ మాట్లాడారు. నీట్ పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో ప్రధాని మోదీతో చర్చించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. నీట్ పేపర్ లీక్ అంశం వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు చెప్పుకొచ్చారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీట్ పున:పరీక్ష నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చామని, ఈ ఫలితాలను కూడా ఆలస్యం లేకుండా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు అవసరమని ప్రధాని మోదీ సూచించారని కిరణ్ రిజిజు వెల్లడించారు. పేపర్ లీక్‌లను పూర్తిగా అణచివేయడానికి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా దేశంలోని ప్రముఖ న్యాయవాదులను నియమించాలని ప్రధాని సూచించారని తెలిపారు. అదేవిధంగా ఎన్డీఏ సమావేశంలో దేశ ఆర్థిక పురోగతి, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు , ప్రభుత్వ విజయాలపై కూడా ప్రధాని సమీక్షించారని తెలిపారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాల్లో రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రధాని హామీ ఇచ్చారని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే ప్రతి ఒప్పందాన్ని రూపొందిస్తున్నామని, వారి ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ప్రధాని మోదీ స్పష్టం చేశారని కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే తలసాని




హైదరాబాద్, జులై 21:ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థించానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి హాజరైన శ్రీనివాస్ యాదవ్‌కు దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2014 వరకు అమ్మవారి కళ్యాణం ఆలయం లోపల నిర్వహించేవారు.

తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఆలయ ముందు నిర్మించిన భారీ రేకుల షెడ్డు కింద లక్షలాది మంది భక్తులు వీక్షించేలా అమ్మవారి కళ్యాణం నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. అమ్మవారి కళ్యాణానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు.

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఎల్లమ్మ తల్లి చల్లని దీవెనలతో విస్తారంగా వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలి. పాడిపంటలతో రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం.. జోగినిలకు ప్రాముఖ్యం: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జులై 21: బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.

కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. ఎవిఖ దర్శనాలు, వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు.

జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని లతిజూ గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు.

అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని అన్నారు.

ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## ఢిల్లీలో అగ్నిప్రమాదం... ముగ్గురి మృతి



న్యూఢిల్లీ, జులై 21: ఢిల్లీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బీకేదత్ కాలనీలోని ఓ నివాస గృహంలో ఈరోజు(మంగళవారం) అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

అయితే అప్పటికే ఇంట్లో చిక్కుకున్న మహిళ, ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదం ఎలా జరిగింది, షార్ట్ సర్క్యూట్ కారణమా.. లేదా ఇతర కారణాలున్నాయా.. అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన సమయంలో ఇంట్లో మరెవరైనా ఉన్నారా.. అనే విషయాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ దుర్ఘటనపై స్థానికులు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# వర్షాభావ పరిస్థితిలపై మంత్రుల సమీక్ష..




వరంగల్, జులై 21:ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముం దస్తు కార్యాచరణ, వివిధ శాఖల సంసిద్ధత, కంటింజెన్సీ ప్రణాళికలపై హనుమకొండ ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవా రం జరుగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి సమీక్ష సమావేశ మునకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి పుష్ప గుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ నగర సి.పి శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద..తో పాటు ఆరు జిల్లా ల కలెక్టర్ లు హాజరయ్యారు ..

## యశోద హాస్పిటల్‌లో 395 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలతో అరుదైన రికార్డు


-రక్త గ్రూపులు వేరైనా విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్లు
- వయోభారంతో సంబంధం లేకుండా ఆధునిక చికిత్సలు: వైద్యులు




హైదరాబాద్, జులై 21:హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగం 395 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి అరుదైన రికార్డు నెలకొల్పిందని ప్రముఖ నెఫ్రాలజిస్టులు డాక్టర్ రాజశేఖర చక్రవర్తి, డాక్టర్ మురళీనాథ్ వాకడల తెలిపారు. మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ శస్త్రచికిత్సల ద్వారా వందలాది మంది రోగులకు కొత్త జీవితాన్ని అందించామని చెప్పారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్తగ్రూపులు ఒకే విధంగా ఉండాల్సి వచ్చినప్పటికీ, అత్యాధునిక వైద్య విధానాలతో రక్తగ్రూపులు వేరుగా ఉన్న రోగులకూ విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేసినట్లు వెల్లడించారు.

వయస్సు కూడా శస్త్రచికిత్సలకు అడ్డంకి కాదని, 60 ఏళ్లు పైబడిన వృద్ధుల్లోనూ విజయవంతంగా కిడ్నీ మార్పిడి నిర్వహించినట్లు తెలిపారు. డయాలసిస్ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, కిడ్నీ మార్పిడి ద్వారా రోగుల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో అంతర్జాతీయ ప్రమాణాల చికిత్స అందిస్తూ దేశంలోని ప్రముఖ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రంగా ఎదుగుతోందని చెప్పారు. సమావేశంలో మార్కెటింగ్ హెడ్ చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పురస్కారాలను కొనసాగించాలి: కే.విరాహత్ అలీ



హైదరాబాద్, జులై 21:గత ప్రభుత్వం జర్నలిస్టులకు పురస్కారాలు అందించిందని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని విస్మరించిందని, వాటిని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఆ ప్రకటనలో జర్నలిస్టుల పాత్ర గురించి వెల్లడించిన అంశాలు.. చరిత్రాత్మకమైన తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన పాత్ర క్రియాశీలకం.

తెలంగాణ ఉద్యమం లో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి, ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదు. ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి తెలియజేయడం, ప్రత్యేక రాష్ట్ర అవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చారు. తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక-ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను చర్చకు తీసుకువచ్చారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అదేవిధంగా పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు కూడా నాయకత్వం వహించారు.

ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయి. ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడట, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారు.

అంతేకాకుండా, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారు. కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జర్నలిస్టుల పాత్రను గత ప్రభుత్వం గుర్తించి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజున జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలు అందించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం



ఆ ప్రక్రియ కొనసాగించేందుకు కమిటీ సిఫారసు చేయాలని కోరుతున్నాం.

ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి, వారి సేవలకు తగిన గౌరవం, గుర్తింపు, ప్రభుత్వం కల్పించే అన్ని అర్హతలను అందించాలి.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలి.

## ఘోరం.. నిర్మాణంలో ఉన్న సొరంగంలో చిక్కుకుని 8 మంది దుర్మరణం




న్యూఢిల్లీ, జులై 21:ఈశాన్య రాష్ట్రం సిక్కిం లో ఘోరం జరిగింది. నిర్మాణంలో ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కొండచరియలు విరిగిపడటంతో సొరంగం కూలిపోయి పలువురు కార్మికులు అందులో చిక్కుకుపోయారు. అందులో మీథేన్ వాయువు లీక్ కావడంతో కొందరు ఊపిరాడక చనిపోయారు. ఇప్పటివరకు ఎనిమిది మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మరో 12 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

ఇంకో 18 మందికిపైగా కార్మికులు సొరంగంలో చిక్కుకుని ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దక్షిణ సిక్కింలోని సమర్‌డుంగ్‌లో తీస్తా స్టేజ్-6 జలవిద్యుత్ ప్రాజెక్టులో భాగంగా పటేల్ ఇంజినీరింగ్ సంస్థ ఈ సొరంగాన్ని నిర్మిస్తోంది. మీథేన్ వాయువు లీక్ వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాయువు మోతాదు ఎక్కువగా ఉండటంతో చిక్కుకు పోయిన కార్మికులు ఉన్న ప్రాంతానికి సహాయక బృందాలు చేరుకోలేకపోతున్నాయి.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), సిక్కిం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. సొరంగం లోపల పెద్ద పేలుడు లాంటి శబ్దం వినిపించడంతో బయటకు పరుగులు తీశామని బయటపడిన కార్మికులు చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. అయితే కొండచరియలు ఎందుకు విరిగిపడ్డాయన్నది ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. సొరంగంలో చిక్కుకుపోయిన వారి సంఖ్యపై కూడా ఇంకా స్పష్టత లేదని తెలిపారు.

## తెలంగాణలో నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్, జులై 21: ఉపరితల ద్రోణి ప్రభావంతో నేడు(మంగళవారం) ఉత్తర తెలంగాణ జిల్లాలోని పలు చోట్ల భారీ వర్షాలుకురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే హైదరాబాద్ నగరంలో తేలికపాటి వర్షం కురియనుంది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం కురిసే సమయాల్లో చెట్ల కింద ఉండొద్దని సూచించారు.

## మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ ధర్నా


-రాహుల్ నేతృత్వంలో ఎంపీల ఆందోళన
-ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్
-చేతులకు తాళ్లు కట్టుకొని నిరసన



న్యూఢిల్లీ, జులై 21: పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ ఎంపీలు మంగళవారం ధర్నాకు దిగారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో ప్రధాని మోదీ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

నిరసనలో భాగంగా కాంగ్రెస్ ఎంపీలు చేతులకు తాళ్లు కట్టుకొని వినూత్నంగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నివాసం సమీపంలో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు.

ఈ ధర్నాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పార్లమెంట్ వాయిదా అనంతరం చేపట్టిన ఈ ఆందోళన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# మన సంస్కృతిలో భాగమైన 'గోల్డెన్ ఫ్రూట్' : మామిడి

## (22 జూలై "జాతీయ మామిడి దినోత్సవం" సందర్భంగా)

వేసవి కాలం రాగానే మార్కెట్లన్నీ మామిడి పండ్ల రాసులతో కళకళలాడుతాయి. మామిడి కేవలం పండు మాత్రమే కాదని, మన సంస్కృతి, చరిత్రలో ఒక అంతర్భాగంగా భావిస్తున్నాం. భారతదేశంలో 5,000 ఏండ్ల క్రితమే మామిడిని సాగు చేయడం ప్రారంభమైంది. హిందూ పురాణాల్లో మామిడి పండ్లు దేవతలతో ముడిపడి ఉన్నాయి. మామిడి ఆకును శుభంగా భావించిన శుభకార్యాల్లో తోరణాలుగా కూడా కట్టడం ఓ పవిత్రత సంప్రదాయంగా కొనసాగుతోంది. నోరూరించే రుచి, అమోఘమైన వాసన, ఆకర్షణీయమైన రంగు, ఆకట్టుకునే రూపం, దృష్టిని దోచుకునేరిమాణం, అద్భుత పోషక విలువలు, అత్యంత ప్రజాదరణ, వేల ఏండ్ల సాంస్కృతిక గుర్తింపు కలిగిన పండ్లు అనేకం ఉన్నప్పటికీ పండ్లన్నింటిలో మామిడి పండ్లకు ప్రత్యేకమైన స్థానం ఇవ్వబడింది.

### జాతీయ ఫలం – కింగ్ ఆఫ్ ఫ్రూట్ :

ప్రపంచవ్యాప్తంగా మామిడి పండును "కింగ్ ఆఫ్ ఫ్రూట్" లేదా "పండ్లలో రారాజు" అని పిలవడం జరుగుతున్నది. భారత్‌లో "జాతీయ ఫలం" లేదా "నేషనల్ ఫ్రూట్"గా పిలువబడుతోంది. రుచి, సువాసనల ఆధారంగా భారత్‌లో ప్రధానంగా అల్ఫోన్సా, తోతారురి, బంగినపల్లి, మల్గోవా, దసేరీ లాంటి మామిడి పండ్ల రకాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఆసియా దేశాల్లో అధికంగా లభించే పెద్ద ముళ్ల పండు "దూరియన్"ను కూడా ప్రపంచ పండ్ల రాజు అని కొన్ని దేశాలు భావిస్తాయి. ప్రపంచంలో "క్వీన్ ఆఫ్ ఫ్రూట్" లేదా "పండ్లలో రాణి" అనే గుర్తింపును "మాంగోస్టీన్" అనే పండు చేజిక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా మామిడి పండ్ల ప్రాధాన్యతను గుర్తించిన భారతదేశం 1987లో ప్రారంభించిన "జాతీయ మామిడి దినోత్సవం" లేదా "నేషనల్ మ్యాంగో డే"ను ప్రతి ఏటా 22 జూలై రోజున నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

### మామిడి పండు పోషక విలువలు :

"మంగీఫెరా ఇండికా" అనబడే శాస్త్రీయ నామం కలిగిన మామిడి పండ్లలో దాదాపు 1,000 రకాలు ఉన్నాయి. అస్సాం, మయాన్మార్ ప్రాంతాల నుంచి ప్రారంభమైన మామిడి పండ్ల ఉనికి నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి అత్యంత ప్రజాదరణ పొందింది. ఫిలిప్పీన్స్‌కు చెందిన "కారాబావో" మామిడి పండ్ల రకం అధిక చక్కెర శాతం, నోటిలో కరిగిపోయే గుజ్జుతో "అత్యంత తియ్యటి మామిడి పండు"గా గిన్నీస్ రికార్డు పొందింది. మామిడి పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఈ, ఖనిజ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడడం, రోగ నిరోధకశక్తి పెరగడం, చర్మం/ జుట్టుకు మేలు కలిగించడం, గుండె ఆరోగ్యానికి తోడ్పడడం, దృష్టిని మెరుగుపరచడం, మెదడు ఆరోగ్యం పెంచడం, శరీరాన్ని నిర్విషీకరణ చేయడం, బరువును తగ్గించడం, వేడి తగ్గించడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన మామిడి పండ్లు మార్కెట్‌లో అత్యధికంగా దాదాపు కిలో ధర రూ: 3 లక్షల వరకు పలుకుతాయి. జీవితం ఒక మామిడి పండు లాంటిది. కొద్దిగా పులుపు, ఎంతో తీపి గుజ్జు కలిగిన మామిడి పండును భారత దేశపు "బంగారు ఫలం (గోల్డెన్ ఫ్రూట్)"గా కీర్తించబడుతోంది.

మామిడి ఫలం రాజధాని – మలిహాబాద్ నగరం:

భారత్‌లోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్ద మామిడి ఉత్పత్తి కేంద్రంగా యూపీలోని లక్నో సమీప నగరం మలిహాబాద్‌ను "మామిడి రాజధాని" లేదా "క్యాపిటల్ ఆఫ్ మ్యాంగో"గా పిలుస్తున్నాం. భారత్‌లో సాలీనా దాదాపు 230 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పండ్ల దిగుబడి నమోదు అవుతున్నది. ప్రపంచం మొత్తం మామిడి పండ్లలో 40 – 45 శాతం వాటా ఒక్క భారతదేశానిదే అని గమనించాలి. మామిడి ఉత్పత్తిలో భారత్ స్థానం సుస్థిరంగా ఉన్నది. మలిహాబాద్ నగరం 'దసేరీ మామిడి' రకాలకు ప్రసిద్ధి. బీహార్‌లో లభించే "మియాజాకి" రకం పండ్లను "సూర్యుని గుడ్డు" అని పిలువబడుతూ అత్యంత ఖరీదైన మామిడి పండ్లుగా పేరుగాంచాయి. భారత్‌లో ప్రసిద్ధ మామిడి రకాల్లో దసేరీ, పాండే బంగనపల్లి, పాండే అల్ఫోన్సో, పాండే కేసరి, పాండే లంగ్రా రకాలు ప్రజాదరణ పొందాయి.

భారత్‌లో పండే మామిడి పంటలో దాదాపు 25 శాతం కంటే ఎక్కువ యూపీ నుంచే పండుతున్నాయి. యూపీ, ఏపీ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు 67 శాతం పండిస్తూ మామిడి ఉత్పత్తిలో ముందున్నాయి.

మామిడి ఉత్పత్తుల్లో పండ్లను నేరుగా తీసుకోవడంతో పాటు పచ్చళ్లు, తాండ్ర, పొడి, జామ్, రసం, లస్సీ, క్యాండిల్స్, పల్ప్, ఎండబెట్టిన ఒరుగు ముక్కలు లాంటివి అనేకం మన జీవితాలతో ముడిపడి ఉన్నాయి.

మామిడి కాయల ముక్కలను ఉగాది పచ్చడిలో కూడా వినియోగించడం ఆచారంగా వస్తున్నది. మామిడి పండు లేకుండా వేసవిని ఊహించడం కష్టం. మామిడి పండును తినని వారుండరు. మన సంస్కృతి, వారసత్వాలకు ప్రతీకగా నిలిచిన మామిడి పండ్లను ఆస్వాదిస్తూ ఆరోగ్య సౌభాగ్యంతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.



–మధుపాలీ
9949700037

# అరటి తోటల నుంచి మఖానా మార్కెట్ల దాకా..
# బీహార్ వ్యవసాయ రంగానికి జాతీయ రహదారుల ఊతం

న్యూఢిల్లీ, జులై 21:బీహార్ రాష్ట్రంలోని సారవంతమైన మైదానాల మీదుగా నిత్యం సూర్యోదయానికి ముందే ఖగారియాలోని పొలాల నుంచి అరటి గెలలు నింపిన లారీలు బయల్దేరుతుంటాయి. మరోవైపు దేశంలోనే అతిపెద్ద మఖానా సాగు కూడళ్లలో ఒకటైన పూర్ణియాలోని చెరువులు, ప్రాసెసింగ్ కేంద్రాల నుంచి మఖానా బస్తాలతో ట్రక్కులు ప్రయాణం ప్రారంభిస్తాయి. అయితే, వాహన రాకపోకల రద్దీ, సీజన్ల వారీ అంతరాయాలతో అత్యంత విలువైన ఈ పంటల రవాణా వేగం తరచూ మందిస్తూంటుంది. అరటి వంటి నశ్వర పంటకు ప్రతి నిమిషం విలువైనదే గనుక వేగంగా, విశ్వసనీయంగా గమ్యం చేర్చగల రవాణా సౌకర్యం అవశ్యం. తద్వారా అరటి నాణ్యత పరిరక్షణతోపాటు పంట పాడవకముందే మార్కెట్లకు చేరడం ద్వారా రైతుకు లాభదాయక ధర లభించే వీలుంటుంది. ఈ నేపథ్యంలో రైతు ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర పరిధిలోని రెండు జాతీయ రహదారుల ఉన్నతీకరణకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఖగారియా–పూర్నియా విభాగంలోని ఎన్‌హెచ్–31, ఎన్‌హెచ్–231 విభాగం రహదారిని 4 వరుసలకు ఉన్నతీకరించాలని రోడ్డు రవాణా–జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించగా, మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపింది.

ఈ నిర్ణయానికి అనుగుణంగా రూ.3,936.05 కోట్లతో చేపట్టే రహదారి విస్తరణ పనులు ప్రమాణాలకు తగినట్లు పూర్తయితే బీహార్ అరటి, మఖానా పంటలను సకాలంలో మార్కెట్లకు చేరవేయడం సులువవుతుంది. అలాగే, ఈ పంటల సాగుపై ఆధారపడిన రైతులు, కార్మికులు, వ్యాపారులకు సౌలభ్యం కలుగుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి వ్యవసాయ కూడలి కూడా బలోపేతం అవుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, విలువ కొన్ని గంటల ఆలస్యంతో క్షీణిస్తుంది కాబట్టి, ఈ ప్రాంతంలో రహదారుల ఉన్నతీకరణ ప్రాజెక్టుకు ఎనలేని ప్రాధాన్యం ఉంది.

బీహార్‌లో వరద నిరోధక మౌలిక సదుపాయాల కల్పన

తూర్పు బీహార్ రవాణా వ్యవస్థకు చారిత్రకంగా వరదల ముప్పు అధికం. ముఖ్యంగా కోసి, గంగా నదీ పరీవాహక ప్రభావంగల ప్రదేశాలన్నిటా వర్షాకాలంలో వరదలతో తరచూ రహదారి సంధానం తెగిపోతూంటుంది. దీంతో ప్రయాణిక, వస్తు రవాణా మందగించి ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఈ పరిస్థితుల నడుమ ఖగారియా–పూర్ణయా విభాగంలో రహదారులను 4 వరుసలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు పదేపదే సంభవించే వరదల వల్ల ఎదుర్యే సవాళ్లను పరిష్కరించేలా పునరుత్థాన సామర్థ్యం పెంపు లక్ష్యంగా ఇంజినీరింగ్ కార్యక్రమాలను కూడా ఈ ప్రాజెక్టుకు జోడించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా రహదారి రూపురేఖల మెరుగుదల, పాదచార అంచుల బలోపేతం, ఆధునిక వ్యర్థజల పారుదల వ్యవస్థల సంధానం అవసరమని నిర్ణయించారు. తద్వారా ఏడాది పొడవునా మరింత విశ్వసనీయ రవాణా సదుపాయానికి భరోసా ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

### కొత్త అవకాశాలతో సీమాంచల్ సంధానం

పరిమిత అనుసంధానం కారణంగా సీమాంచల్ ప్రగతి చిరకాలం నుంచీ కుంటుబడింది. రాష్ట్రంలోని అనేక ఇతర ప్రాంతాలతో పోలిస్తే- ఖగారియా, కటీహార్ సహా ఇరుగుపొరుగు జిల్లాల ప్రజలకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మేరకు పరిపాలన, విద్యా, ఆర్థిక కేంద్రాల్లో పనుల కోసం వెళ్లాలంటే ప్రయాణ దూరం–సమయం కూడా ఎక్కువ కావడంలో చిక్కులు తప్పడం లేదు.

ఈ నేపథ్యంలో రహదారి ఉన్నతీకరణ, నవీకరణల ద్వారా కీలక గమ్యాల మధ్య ప్రయాణ దూరం, సమయం కూడా తగ్గుతాయి. ఇప్పుడు సుమారు 3.5 నుంచి 4 గంటలుగా ఉన్న సమయం రహదారి ఉన్నతీకరణ తర్వాత 1.5 నుంచి 2 గంటలకు తగ్గి, ప్రాంతీయ రవాణా గణనీయంగా మెరుగుపడుతుంది.

తూర్పు భారత అంతర్రాష్ట్ర అనుసంధానం బలోపేతం

బీహార్ రాష్ట్రానికి మాత్రమే గాక తూర్పు భారత ప్రాంత అంతర్రాష్ట్ర అనుసంధానం రీత్యానూ ఖగారియా–పూర్ణియా విభాగం రహదారికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. దీని ఉన్నతీకరణ పూర్తయితే బీహారుకు పొరుగునగల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంతో రహదారి సంధానం బలోపేతం అవుతుంది. మరోవైపు విస్తృత జాతీయ రహదారి నెట్‌వర్క్ అందుబాటులోకి రావడం వల్ల జార్ఖండ్ రాష్ట్ర ప్రవేశ మార్గం కూడా మెరుగవుతుంది.

### ట్రాఫిక్ గందరగోళం నుంచి విముక్తి

ఖగారియా–పూర్ణియా విభాగం రహదారి నవీకరణతో ఇతంత్రా ట్రాఫిక్ గందరగోళం నుంచి కూడా ప్రజలకు విముక్తి కల్పిస్తుంది. ఈ మేరకు ఖగారియా, భాగల్పూర్, కటీహార్, పూర్ణియా జిల్లాల్లో అధిక జనసాంద్రత గల పట్టణ–శివారు ప్రాంతాల రహదారి రూపురేఖలు మెరగవుతాయి. ప్రమాదకర మలుపులు, వాహన రాకపోకల తీవ్ర రద్దీ వంటి దీర్ఘకాలిక సమస్యలు తొలగిపోతాయి. ప్రస్తుతం రెండు వరుసలకు పరిమితమైన ఈ కీలక మార్గం 4 వరుసలకు విస్తరిస్తుంది కాబట్టి, సీమాంచల్ ప్రాంత అనుసంధానం బలోపేతం కాగలదు. దీంతోపాటు ఖగారియా, భాగల్పూర్, కటీహార్, పూర్ణియా, పాట్నాలను పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలతో సంధానిస్తుంది.

కీలక ఆర్థిక–లాజిస్టిక్స్ కేంద్రాల అనుసంధానం

ఈ మార్గం ఉన్నతీకరణతో బీహార్‌లోని అనేక ప్రధాన ఆర్థిక–సామాజిక, లాజిస్టిక్స్ కూడళ్ల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. ఒక జౌళి పరిశ్రమల సముదాయం, రెండు మెగా ఫుడ్ పార్కులు, రెండు ఫిషింగ్–సీఫుడ్ పార్కులు సహా 5 పీఎం గతిశక్తి ఆర్థిక కేంద్రాలను, 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, ఒక విమానాశ్రయం, 4 జాతీయ రహదారులు, 2 రాష్ట్ర రహదారులు 11 లాజిస్టిక్స్ కేంద్రాలను అనుసంధానిస్తుంది. తద్వారా ఈ ప్రాజెక్టుతో సీమాంచల్ ప్రాంతమంతటా బహుళ రవాణా ఏకీకరణ గణనీయంగా మెరుగవుతుంది.

# ఒడిశా కొత్త తీరప్రాంత రహదారి... ఆధ్యాత్మిక, తీరప్రాంత పర్యాటకానికి ముఖద్వారం

న్యూఢిల్లీ, జులై 21:ఒడిశా తీరప్రాంతంలో రవాణా అనుసంధానాన్ని సమూలంగా మార్చనున్న 160.18 కిలోమీటర్ల పొడవైన 'రామేశ్వర్–పారాదీప్ తీరప్రాంత రహదారి' నిర్మాణంతో ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశం కలిగింది. రూ. 8,300.79 కోట్ల వ్యయంతో కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. ఖుర్దా, పూరీ, కేంద్రపడ, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల మీదుగా సాగే ఈ రహదారి... రాష్ట్రంలోని ముఖ్యమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక, ఆర్థిక కేంద్రాల మధ్య సజావైన రవాణా అనుసంధానాన్ని కల్పిస్తుంది.

వేగవంతమైన, సురక్షితమైన, సజావైన ప్రయాణాన్ని అందించడం లక్ష్యంగా రూపొందించిన ఈ ప్రాజెక్టులో భాగంగా రామేశ్వర్ నుంచి కోణార్క్ వరకు 4–వరుసల యాక్సెస్- నియంత్రిత జాతీయ రహదారి, కోణార్క్ నుంచి పారాదీప్ వరకు 2–వరుసల జాతీయ రహదారిని నిర్మిస్తారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుండే ఈ మార్గం అందుబాటులోకి వస్తే... రామేశ్వర్–పారాదీప్ మధ్య ప్రయాణ సమయాన్ని ఈ కారిడార్ దాదాపు 2 గంటల 30 నిమిషాలు తగ్గిస్తుంది. ప్రయాణికుల రవాణాతో పాటు ఇది సరుకు రవాణా కనెక్టివిటీనీ మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

ఒడిశాలోని అత్యంత ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాలకు వేగంగా చేరుకునే అవకాశాన్ని కల్పించడం ద్వారా ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక రంగానికి ఈ కొత్త తీరప్రాంత రహదారి ఒక ప్రధాన చోదక శక్తిగా మారుతుంది.

ఈ కారిడార్ పూరీలోని ప్రపంచ ప్రఖ్యాత జగన్నాథ ఆలయం, చారిత్రక కోణార్క్ సూర్య దేవాలయం, పవిత్రమైన రామచండీ ఆలయం మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. ప్రతియేటా ఒడిశాకు వచ్చే లక్షలాది మంది భక్తుల తీర్థయాత్ర అనుభవాన్ని ఇది మరింత సౌకర్యవంతంగా మార్చనుంది.

మెరుగైన రహదారి మౌలిక సదుపాయాలు ప్రయాణ సమయాన్ని తగ్గించడం సహా... పర్యాటకులు, భక్తుల కోసం సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాన్ని కల్పిస్తూ వారి మొత్తం యాత్ర అనుభవాన్నీ మెరుగుపరుస్తాయి. ఈ ప్రాంతంలో రాబోయే విమానాశ్రయ మౌలిక సదుపాయాలతో దేశవిదేశాల నుంచి వచ్చే సందర్శకులు సులభంగా గమ్యస్థానాలకు చేరుకునేందుకు వీలుంటుంది. ఒక ప్రధాన ఆధ్యాత్మిక పర్యాటక గమ్యస్థానంగా ఒడిశా స్థానం మరింత మెరుగవుతుంది.

రవాణాకు అతీతంగా... చారిత్రక దేవాలయాలు, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలతో ప్రజలను అనుసంధానించడం ద్వారా భారత సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు, ప్రోత్సాహానికి ఆధునిక మౌలిక సదుపాయాలు ఎలా తోడ్పడగలవో ఈ రహదారి సూచిస్తుంది.

ఒడిశా తూర్పు తీరప్రాంతంలోని బీచ్‌లు, వారసత్వ ప్రదేశాలు, జీవవైవిధ్య కేంద్రాలు, స్థానిక కమ్యూనిటీలను అనుసంధానిస్తూ... రామేశ్వర్–పారాదీప్ కారిడార్ కొత్త తీరప్రాంత పర్యాటకానికి ముఖద్వారంగా మారనుంది.

పూరీ, కోణార్క్, పారాదీప్ మధ్య అనుసంధానం మెరుగుపడటంతో, ఈ గమ్యస్థానాలు ఒక ఏకీకృత పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా ఆవిర్భవిస్తాయి. ఇది ప్రయాణికులకు ఆధ్యాత్మిక వారసత్వం, ప్రాచీన వాస్తుశిల్పం, బీచ్‌లు, ప్రకృతి సంబంధ ప్రదేశాల వరకు సంపూర్ణ తీరప్రాంత సందర్శన అనుభవాన్ని అందిస్తుంది.

ఈ రహదారి సముద్ర తీర పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, ప్రకృతి ఆధారిత ప్రయాణాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుంది. వన్యప్రాణుల సంరక్షణ ప్రాంతాలు, ప్రసిద్ధ గహిర్మాతా తాబేళ్ల గూళ్ల ప్రదేశాలు సహా ముఖ్యమైన పర్యావరణ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

మెరుగైన అనుసంధానం, ఒడిశాలోని విశిష్టమైన తీరప్రాంత జీవనవైవిధ్యం, పరిరక్షణ ప్రయత్నాలపై అవగాహనను పెంచడం ద్వారా సుస్థిర పర్యాటక పద్ధతులనూ ఇది ప్రోత్సహిస్తుంది. సున్నితమైన పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించే బాధ్యతాయుత పర్యాటక నమూనాలకు మద్దతునిస్తూనే, ఇక్కడి సహజ ప్రకృతి దృశ్యాలనూ సందర్శకులు వీక్షించవచ్చు.

ఈ కొత్త రహదారి... ఈ మార్గంలోని హోటళ్లు, హోమ్‌స్టేలు, రెస్టారెంట్లు, హస్తకళల విపణులు, పర్యాటక ఆధారిత వ్యాపారాల వృద్ధిని ప్రోత్సహించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలనూ కల్పిస్తుంది.

పీఎం గతిశక్తి మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా... ఈ ప్రాజెక్టు 9 ఆర్థిక కేంద్రాలను, 5 సరుకు రవాణా కేంద్రాలను అనుసంధానించడం ద్వారా ఒడిశా ఆర్థిక నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేస్తుంది. ఇది ఈ ప్రాంతంలోని కీలకమైన పారాదీప్ పోర్ట్, పూరీ రైల్వే స్టేషన్, పూరీ విమానాశ్రయం, ఇతర ప్రాంతీయ ఆర్థిక కేంద్రాలు మరింత మెరుగ్గా అందుబాటులోకి ఉండేలా చేస్తుంది.

# రైతు పరామర్శ యాత్రకు తరలిన బీఆర్ఎస్ నేతలు



ఆదిలాబాద్, జులై 21: లక్షేటపేట నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా మృతి చెందిన రైతు కుటుంబాలను పరామర్శించేందుకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన పర్యటనకు ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. కేటీఆర్ రైతు కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకోనున్నారు.

భూక్య జాన్సన్ నాయక్‌తో పాటు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, నాయకులు ప్రసాద్ నేత, పేరం శ్రీనివాస్, ఫజల్ ఖాన్, శ్రీనివాస్ గౌడ్, రాకేష్, రెడ్డి, మహేష్, సాయి తదితరులు కార్లు, ఇతర వాహనాల్లో లక్షేటపేటకు బయల్దేరారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం



కరీంనగర్, జులై 21:ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి,వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలియ జేశారు.

గ్రీవెన్స్ డేలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓర్పుతో విని, ఫిర్యాదులను స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి,చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తద్వారా ఫిర్యాదుదారులకు పోలీస్ శాఖపై మరింత భరోసా, విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రజలు, బాధితులు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె.శ్రీనివాస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల నాయకులతో ప్రభుత్వ సమావేశం

న్యూఢిల్లీ, జులై 21:పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇవాళ న్యూఢిల్లీలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైంది. పార్లమెంటు భవన ప్రాంగణంలో కేంద్ర పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల శాఖల మంత్రి శ్రీ కిరణ్ రిజిజు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ, రసాయనాలు–ఎరువుల శాఖ మంత్రి (రాజ్యసభా నాయకుడు) శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా, శాసన–న్యాయశాఖ (స్వతంత్ర బాధ్యత) సహా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్, అలాగే పార్లమెంటరీ వ్యవహారాలు–సమాచార–ప్రసార శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ కూడా ఇందులో పాల్గొన్నారు. మొత్తం మీద 40 రాజకీయ పార్టీల నుంచి 58 మంది నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

తొలుత రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నాయకులందరికీ స్వాగతం పలుకగా, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు సమావేశం నిర్వహించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 20 (సోమవారం) నుంచి ప్రారంభమవుతాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలు, అవసరాల మేరకు ఆగస్టు 13న (గురువారం) సమావేశాలు ముగిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈసారి సమావేశాల వ్యవధి 25 రోజులు కాగా, 19 సమావేశ దినాలు ఉంటాయని ఆయన వివరించారు. అలాగే, వర్షాకాల సమావేశాల సంబంధిత శాసన కార్యకలాపాల వివరాలను రెండు పార్లమెంటు సచివాలయాలు ఈ నెల 16న ''బులెటిన్ పార్ట్–ఎఎ'లో ప్రచురించాయని శ్రీ రిజిజు గుర్తు చేశారు.

సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని ఈ సందర్భంగా నాయకులందరికీ ఆయన విజ్ఞప్తి చేశారు. ఉభయ సభల విధాన నియమావళికి అనుగుణంగా అనుమతి గల ఏ ఇతర ముఖ్యాంశాల మీదనైనా సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ సమావేశాల్లో తాము లేవనెత్తే అవకాశం గల వివిధ అంశాలపై ఆయా పార్టీల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ, ప్రభుత్వానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు లేవనెత్తిన అంశాలన్నింటినీ శ్రీ రిజిజు నమోదు చేసుకున్నారు. ఈ సమావేశానికి హాజరై, అభిప్రాయాలను తెలపడంలో చురుగ్గా, సమర్థంగా వ్యవహరించిన నాయకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర భద్రత యంత్రాంగం.. న్యాయ వ్యవస్థ.. పోలీసు సామర్థ్య బలోపేతంపై పలు కీలక ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ, జులై 21:పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలపై ఈ రోజు కోల్‌కతాలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కేంద్ర హోం శాఖ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతల తాజా పరిస్థితిపై సమీక్షలో భాగంగా భద్రత యంత్రాంగం, న్యాయ వ్యవస్థ సహా పోలీసు విభాగంలో సామర్థ్య బలోపేతంపై శ్రీ అమిత్ షా అనేక కీలక ఆదేశాలు జారీచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ 'మహిళా అవగాహన కార్యక్రమం' నిర్వహించాలని సూచించారు. అలాగే, అధికారులు గ్రామీణ మహిళలతో నిరంతర సంప్రదింపుల ద్వారా వారిలో అవగాహన పెంచి సాధికారత కల్పనకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఏదైనా అవసరం ఏర్పడితే రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కేంద్ర హోం శాఖను సంప్రదించవచ్చునని సూచించారు.

రాష్ట్ర అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా చేపట్టాల్సిన పలు చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 'యాంటీ-నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్' (ఏఎన్‌టీఎఫ్), 'యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్' (ఏటీఎస్) సహా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తరహాలో 'రాష్ట్ర దర్యాప్తు సంస్థ' (ఎస్ఐఏ)ను ప్రత్యేకంగా ఏర్పరచాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో ఉగ్రవాదం, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) సంబంధిత కేసులన్నింటిపై 'ఎన్ఐఏ' ద్వారా సమగ్ర సమీక్షకు నిర్ణయించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల ఆక్రమణలను తక్షణం తొలగించాలని స్పష్టం చేశారు.

పశ్చిమ బెంగాల్ పోలీసుల సామర్థ్య వికాసం, మౌలిక సదుపాయాల బలోపేతం, అత్యాధునిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. రాష్ట్ర పోలీసు విభాగం ఆధునికీకరణ, సేవా ప్రదానం మెరుగుదలకు కేంద్రం నుంచి తగిన బడ్జెట్ మద్దతు లభిస్తుందని శ్రీ అమిత్ షా హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియలో భాగంగా జాతీయ సగటుకు తగినట్లు పోలీసు బలగాల సంఖ్యను పెంచే దిశగా సమగ్ర సమీక్ష ద్వారా పోలీసు జిల్లాల సంఖ్యను హేతుబద్ధీకరిస్తామని తెలిపారు. అలాగే, ఖాళీలన్నింటినీ నిర్దిష్ట వ్యవధిలో భర్తీ చేయడం, శిక్షణ సామర్థ్యాలపై సమీక్ష సహా పౌర కార్యకర్తలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ఆదేశించారు. కానిస్టేబుళ్ల నియామకానికి ప్రాధాన్యంపై దృష్టి సారించాలని చెప్పారు.

రాష్ట్రంలో ఇంతకుముందు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రత శిబిరాల్లో మూడింట ఒక వంతును 'ప్రభుత్వ సేవా ప్రదాన కేంద్రాలు'గా మార్చడంపై సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అంతేకాకుండా సైబర్ భద్రత రంగంలో సామర్థ్యం పెంపు, మాదకద్రవ్యాల దొంగ రవాణా నిరోధంపై 'ఎన్‌కార్డ్' సమావేశాలను క్రమబద్ధంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కోల్‌కతా నగరం కోసం ఒక సమగ్ర వరద నిర్వహణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశాలిచ్చారు. చివరగా- తక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రాధాన్యాంశాలను గుర్తించి, నిర్దేశిత వ్యవధిలోగా అవి అమలయ్యేలా చూడాలని సంబంధిత అధికార సంస్థలను శ్రీ అమిత్ షా ఆదేశించారు.

# గండగలపాడు మార్గంలో పొలాల్లోకి వెళ్లిన భట్టి విక్రమార్క



"రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా?"

"అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా?"

ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ..

"ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్.. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ఖమ్మం, జులై 21: ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని వైరా మండలం గండగలపాడు నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే, ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు నడిచి వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారితో చేతులు కలిపేందుకు, మాట్లాడేందుకు అక్కడి వారంతా పోటీలు పడ్డారు.

పొలం గట్టుపై నిలబడి, కూలీలతో ఎంతో ఆత్మీయంగా భట్టి విక్రమార్క ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు.

"అక్కయ్యా! మన ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా?"

"మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా?"

ఉపముఖ్యమంత్రి దృష్టికి 'రవాణా' కష్టాలు

ఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.సాధారణంగా నాయకులు వేదికల పైనుంచి మాట్లాడటం చూస్తాం. కానీ, ఇలా స్వయంగా డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా.. కాన్వాయ్ ఆపి, పొలంలోకి వెళ్లి కూలీల కష్టసుఖాలు తెలుసుకోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'ప్రజా ప్రభుత్వం' అంటే ఇదేనంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి..

## -పి.వై.ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్




నల్గొండ, జులై 21: నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, సోనమ్ వాంగ్‌చుక్ పిలుపులో భాగంగా చలో పార్లమెంట్ కి వెళ్తున్న యువకులపై లాఠీ చార్జి చేయడం సిగ్గుమాలిన చర్య అని ప్రగతిశీల యువజన సంఘం(పి.వై.ఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని న్యూ డెమోక్రసీ కార్యాలయంలో పి.వై.ఎల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు మారుజొడు సిద్దేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కుమార్ పాల్గొని మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 20 మంది విద్యార్థులకు న్యాయం చేయాలని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా అనేక రూపాల్లో ఆందోళన జరుగుతున్నప్పటికీని కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదని అన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడనాడి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్త్ రఫ్ చేయాలని చెప్పారు.సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే తన డిమాండ్లపై కనీసం చర్చించకుండా బలవంతంగా పోలీసు బలగాలు వచ్చి దీక్షను విరమింప చేయడం దేనికి నిదర్శనం అని అన్నారు. సోనం వాంగ్ చుక్ పిలుపులో భాగంగా యువకులు పార్లమెంటు ముందు నిరసనకు బయలుదేరిన క్రమంలో యువకులపై పోలీసులు విచక్షణ రహితంగా లాఠీ చార్జి చేయడం సరైనది కాదని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 90కి పైగా పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తూ జైళ్లలో నిర్బంధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నీట్ పేపర్ లీక్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలని అన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబిస్తూ విద్యార్థి జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు, యువకులుతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు వడ్లకొండ నాగరాజు, చికిలం వెంకటేష్, సహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, జిల్లా నాయకులు ఎలగందుల సిద్ధులు, దడిగే కృష్ణ, కుండే బీరయ్య పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్ బండ్ పై రాకపోకల పునరుద్ధరణ..

నల్గొండ, జులై 21: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ (చెరువు కట్ట) మరమ్మతు పనులు పూర్తి కావడంతో మంగళవారం నుండి ఈ రూట్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరణ చేశారు. గతేడాది చెరువు కట్ట కుంగడంతో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు కొనసాగించిన ఇరిగేషన్ అధికారులు,ఈ ఏడాది స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ సహకారంతో మంజూరైన రూ.36 లక్షలతో గత 2 వారాల క్రితం మరమ్మతు పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఇరిగేషన్ ఎస్ ఈ ,ఈ ఈ ల పర్యవేక్షణ లో ఏ ఈ, కాంట్రాక్టర్ లు పనులు వేగవంతంగా పూర్తి చేశారు. గత 2 రోజు ల క్రితం ఎమ్మెల్యే సామెల్ కట్ట మరమ్మతు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించగా ,అక్కడ సంబంధిత వర్క్ ఇన్స్పెక్టర్ ,ఏ ఈ లేకపోవడంతో సాక్షాత్తు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు క్షేత్రస్థాయిలో లేకుండా మరమ్మతులు చేపడితే నాణ్యత ఎలా ఉంటుందని ఎమ్మెల్యే స్వయంగా ఇరిగేషన్ ఈ ఈ కి ఫోన్ చేసి ప్రశ్నించారు. మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీతోనే కట్ట వద్ద నీరు లీకేజీ అయ్యి కట్ట కుంగిందని,ప్రస్తుతం చెరువు కట్ట పాత రోడ్డు కి 10 మీటర్ల లోతు తవ్వి మట్టిని నింపి పూర్తి స్థాయిలో మట్టి రోడ్డు ను రోడ్డు రోలర్ తో తొక్కించి పక డ్బందీగా కట్ట బలోపేతం చేశా మని సంబంధిత అధికా రులు తెలిపారు. తొర్రూరు, తిరుమల గిరి, సూర్యాపేట నుండి హైదరా బాద్ కి వెళ్లే,హైదరాబాద్ నుండి తిరుమలగిరి, తొర్రురు కి వెళ్లే బస్సులు, వాహనాలు,లారీలు ఈ మినీ ట్యాంక్ బండ్ మీదుగా వెళ్లేందుకు అధికారులు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 'మ్యూజియం ఆఫ్ వర్డ్స్' ఒకటో దశను కోల్‌కతాలో ప్రారంభించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా



న్యూఢిల్లీ, జులై 21:'మ్యూజియమ్ ఆఫ్ వర్డ్స్' ఒకటో దశను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ సువేందు అధికారి, ఆర్థిక మంత్రి శ్రీ స్వపన్ దాస్‌గుప్తా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, కేంద్ర సాంస్కృతిక కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టరుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సభను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ దేశవ్యాప్త భాషలకు, సంస్కృతికి ఒక ముఖ్యమైన రోజు ఈ రోజు అని వర్ణించారు. దేశంలో సాంస్కృతిక పునరాగృతికి కృషి చేయాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పాన్ని ఈ 'మ్యూజియమ్ ఆఫ్ వర్డ్స్' ఇవాళ సాకారం చేస్తోందని శ్రీ అమిత్ షా అన్నారు. ఏదైనా దేశం లేదా రాష్ట్రం సంస్కృతిని వర్ణించడమనేది భాష లేనిదే సాధ్యపడదు అని మంత్రి అన్నారు. మనిషి భావాలను వ్యక్తం చేసే మాటలు లేనిదే భాషకు ఉనికే ఉండదు అని కూడా ఆయన చెప్పారు. మాటలతో భాష పుడుతుంది, మాటలు భావాల నుంచి పుడతాయి, సంస్కృతికి దర్పణంగా నిలిచేది భాషే, భాష లేకపోతే దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం అసాధ్యం అని శ్రీ షా అన్నారు. భారతదేశ భాషలు, సంస్కృతి, సాంస్కృతిక పునర్జాగరణను భావి తరాలకు చేర్చడంలో 'మ్యూజియం ఆఫ్ వర్డ్స్' ఒక శక్తిమంతమైన సాధనంగా నిలుస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

పాణిని వ్యాకరణ రచనకు సంబంధించిన పూర్తి చరిత్రను ఈ 'మ్యూజియం ఆఫ్ వర్డ్స్' చాలా చక్కని రీతిలో ఆవిష్కరించిందని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. అన్ని దిక్కుల నుంచి గొప్పవైన, శుభప్రదమైన ఆలోచనలు వస్తాయని, వాటిని అణగదొక్కడం కుదరదని, వాటిని ఎవ్వరూ వేధించారని, ఆలోచనల ఆధారంగానే సామాజిక జీవితాన్ని ముందుకు తీసుకుపోవాలని రుగ్వేదం చాటుతోందని ఆయన వివరించారు. మన నాగరికతలో సంకుచిత భావాలు జనించలేవని, సంకుచితత్వానికి మన ఆలోచనావిధానంలో చోటు లేకపోవడమే దీనికి కారణమని ఆయన అన్నారు. మనం భూమి పూజను చేసినప్పుడు గాని, లేదా శాంతి మంత్రాన్ని పఠించినప్పుడు గాని ఒక్క మానవ జాతి అనే కాకుండా పశువులు, మొక్కలు, యావత్తు విశ్వంలో శాంతి వర్ధిల్లాలని కోరుకుంటుంటామని ఆయన గుర్తు చేశారు. ఈ కారణంగా, సంకుచితత్వం భారతీయ సంస్కృతికి ఒక సంకేతంగా ఎప్పటికీ నిలవలేదు అని ఆయన స్పష్టం చేశారు.

'మ్యూజియమ్ ఆఫ్ వర్డ్స్' మన భాషలతో పాటు మన సంస్కృతిని చాలా కాలం దాకా మన భావి తరాల వారికి నేర్పుతుందని, వారికి మన విశిష్ట సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేస్తుందని, ఆ వారసత్వంలో వేళ్లూనుకున్న జీవన మార్గంలో నడిచేలా మార్గం చూపుతుందని శ్రీ అమిత్ షా అన్నారు. భావాల పైన గాని, లేదా ఆలోచనల పైన గాని ఆంక్షలను భారత్ ఎన్నడూ విధించ లేదని ఆయన అన్నారు. ఓంకారం మొదలు మాటల కూర్పు, వ్యాకరణ రచన, శ్రుతి, స్మృతి, చేతిరాత ప్రతులు, శిలాలేఖల నుంచి ముద్రణ యంత్రం వరకూ.. ఈ సమగ్రమైన మాటల ప్రయాణాన్ని మ్యూజియం కళ్లకు కడుతుందన్నారు. డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) సహా 'మ్యూజియమ్ ఆఫ్ వర్డ్స్'ను విస్తరించాలని, భవిష్యత్తు సాంకేతికతలకు అనుగుణంగా భారతీయ భాషలను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. నూతన ఆవిష్కరణలకు భారత్ అభ్యంతరం చెప్పిన దాఖలాలు లేవని, గొప్ప ఆలోచనలను, శుభప్రదమైన పరిణామాలను భారత్ సదా ఆమోదించిందని శ్రీ షా అన్నారు. ఈ కారణంగానే, లెక్కపెట్టలేనన్ని సవాళ్లు, దాడులు ఎదురైనప్పటికీ దేశ సాంస్కృతిక ప్రస్థానం హిమాలయాల్లా ఉన్నతంగా ఉందన్నారు. భారత్‌లోని బహు భాషల చేతనత్వం, జ్ఞాన పరంపర, జనస్మృతి.. వీటిని దృశ్య, శ్రవణ, అనుభవ పూర్వక పంథాల్లో సంరక్షించే ఒక నూతన ప్రయత్నమే ఈ 'పదాల మ్యూజియం' అని మంత్రి చెప్పారు.

బెంగాల్‌లో అనేక మ్యూజియాలు ఉన్నాయని, 'పదాల మ్యూజియం' చాలా కొద్ది కాలంలో తనకంటూ ఒక ప్రధాన స్థానాన్ని ఏర్పరుచుకొంటుందన్న నమ్మకం తనకు ఉందని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. ఈ మ్యూజియానికి వచ్చే ప్రతి ఒక్కరూ అమూల్య జ్ఞానాన్ని, స్ఫూర్తిని తప్పక పొందుతారని ఆయన అన్నారు. 'రాబోయే తరం వారికి భాషా విజ్ఞానాన్ని పరిచయం చేయడం ఎంతో కష్టమైన పని.. అయితే ఈ పనిని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ విజయవంతంగా చేసి చూపించింది' అని శ్రీ షా అన్నారు. "పదాలను ఎవ్వరూ అడ్డుకోజాలరు.. కానీ పదాల విజ్ఞానాన్ని ఈ మ్యూజియమ్ తనలో ఇముడ్చుకొంది. పదాలను వినవచ్చు, పలకవచ్చు, జీవించవచ్చు, తరువాతి తరం వారికి అందజేయనూవచ్చు.. ఈ వారసత్వాన్ని భద్రపరిచి, భావి తరం వారికి అప్పగించే బాధ్యతను నిర్వర్తించడంలో మ్యూజియం కీలక పాత్రను పోషిస్తుంది" అని మంత్రి అన్నారు. భారతదేశ అదృశ్య వారసత్వాన్ని సాంస్కృతిక శాఖ దృశ్య, శ్రవణ, అనుభవ పూర్వకంగా తీర్చిదిద్దే పనిని సాంస్కృతిక శాఖ ఈ మ్యూజియం స్థాపన ద్వారా నెరవేర్చిందని శ్రీ అమిత్ షా అన్నారు.

'ప్రపంచంలో మొట్టమొదటి సారి పలికిన మాట ఏదని 'మ్యూజియం ఆఫ్ వర్డ్స్'లో ప్రశ్నించినప్పుడు ఓంకారం అనే సమాధానం వస్తుంది.. ఓంకారం పేరు వినగానే నిజంగానే ప్రపంచంలో పలికిన మొదటి మాట ఓంకారమేననే మనకూ అనిపిస్తుంది" అని కేంద్ర హోం మంత్రి అన్నారు. తల్లి నోట లాలిపాటలను మనం మన మాతృభాషలో విన్నప్పుడు.. వెంటనే మనకు మన అమ్మ గుర్తుకొస్తుంది అని ఆయన చెప్పారు. "మ్యూజియంలో అనేక విధాలైన కళాకృతులను, చేతిరాత ప్రతులను పదిలపరిచారనీ, వాటిని చూడవచ్చు, తాకవచ్చు" అని ఆయన వివరించారు. దేశంలోని అనేక మాండలికాలను, భాషలను, ప్రతి ప్రాంతానికీ చెందిన జానపద సంప్రదాయాలను మ్యూజియంలో కొలువుదీర్చారని, మాటల మాధ్యమం ద్వారా మన సాంస్కృతిక ప్రస్థానాన్ని వివరిస్తారని మంత్రి అన్నారు. అనేక శిలాలేఖలు, రాగి రేకులు, భోజపత్ర ప్రతులు, చేతిరాత ప్రతులే కాకుండా అచ్చువేసిన పుస్తకాలు కూడా ఇక్కడ ఉన్నాయన్నారు. డిజిటల్ టెక్స్ట్, శ్రవణ మాధ్యమ పురావస్తువులకు తరువాయిగా ఇక ఏఐ యుగంలోనూ ఈ ప్రస్థానాన్ని కొనసాగించవలసి ఉందని శ్రీ షా అన్నారు.

మాటల మ్యూజియంలో ప్రతి ఒక్క గ్యాలరీ ని ఎంతో శాస్త్రీయ పద్ధతిలో రూపొందించారని శ్రీ అమిత్ షా అన్నారు. ఓరియంటేషన్ విభాగం భాష పుట్టుక నుంచి మొదలవుతుందని, పౌరాణికాలు, జోలపాటలు, అనుభూతిపూర్వక మాధ్యమాల ద్వారా భాషా వికాస క్రమాన్ని అర్థం చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారని ఆయన వివరించారు. ప్రతి ఒక్క వ్యక్తికీ తన మాతృభాషతో విడదీయలేని ఒక గాఢ భావోద్వేగ భరిత బంధం ఉంటుందని, ఈ అనుబంధమే మనిషి స్వభావంలో ఓ అంతర్భాగంగా మారాలని శ్రీ షా స్పష్టం చేశారు.

భాషావిజ్ఞానం సహజంగా అభివృద్ధి చెందిన విజ్ఞానమని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. భాష తప్పక విజ్ఞానమే.. కానీ, అది అవసరాలను ఆధారంగా చేసుకొని వర్ధిల్లిందని ఆయన తెలిపారు. భాషలు చాలా సహజత్వంతో మార్పు చెందాయని, ఆ కారణంగానే జనబాహుళ్యంలో ఆదరణకు నోచుకున్నాయని ఆయన చెప్పారు. దేశంలో ప్రతి భాష మనుగడలో ఉండేటట్లు చూడటానికి ఎంతో మంది మహానుభావులు, కవులు, రచయితలు తమ వంతు తోడ్పాటును అందించారని శ్రీ అమిత్ షా తెలిపారు. వారి అమూల్య సేవలను గౌరవించుకోవడానికి మాటల మ్యూజియంలో ప్రత్యేకంగా ఒక గ్యాలరీని ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. దేశ భవిత ఆ దేశం లోని కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఎంత ఎక్కువ మంది విద్యను అభ్యసిస్తున్నారనే అంశంపై ఆధారపడదని, ఎంతమంది యువకులు ఆ ఉన్నత విద్యాసంస్థల్లోని గ్రంథాల యాలకు వెళుతుంటారనే అంశంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడుతుందని శ్రీ షా అన్నారు. యువతీయువకులు తమ వ్యక్తిత్వాన్నీ, మేధను పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను ఉపయోగించుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

భారత నాగరికతా చైతన్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ వచ్చిన దీపస్తంభంగా పశ్చిమ బెంగాల్ చాలా కాలం పాటు నిలిచిందని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. భారత సాంస్కృతిక చేతన నుంచి దూరంగా సుదీర్ఘ కాలం పాటు బెంగాల్‌ను నిలిపే ప్రయత్నాలు సాగాయంటూ ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. దేశానికీ, ప్రపంచానికీ సేవలను అందించడానికి బెంగాల్‌కున్న సామర్థ్యాన్ని క్షీణింపచేసింది ఈ సంకుచిత, విదేశీ ఆలోచనావిధానాలే అని శ్రీ షా అన్నారు. మహర్షి అరవిందులు, స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, చైతన్య మహాప్రభుల పురుటిగడ్డ బెంగాల్ అని శ్రీ షా చెప్పారు. దేశంలో అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, ప్రసిద్ధ సాహిత్యకారులతో పాటు అతి గొప్ప క్రాంతికారుల్లో ఒకరైన నేతాజీ సుభాష్ చంద్ర బోస్ వంటి వారిని అందించింది కూడా బెంగాల్‌యే అని ఆయన అన్నారు. బెంగాల్ సాంప్రదాయికంగా దశాబ్దాల పాటు దేశంలోని ఇతర ప్రాంతాల కన్నా ముందు నిలిచి, తన మేధోపరమైన, సంస్కృతి పరమైన నాయకత్వంతో దేశానికి మార్గదర్శకత్వం వహించిందని శ్రీ షా అన్నారు. భారతదేశ సాంస్కృతిక చేతనకు సంబంధించిన మేధోపమైన దారిదీపం మరో సారి ఉజ్జ్వలమై, తన పూర్తి ప్రకాశంతో ప్రపంచాన్ని మేల్కొలుపుతుందని శ్రీ అమిత్ షా అన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, శ్రీ సువేందు అధికారి సారథ్యంలో బెంగాల్‌లో ప్రస్తుతం చోటుచేసు కుంటున్న మార్పులతో ఈ రాష్ట్రం త్వరలోనే భారతీయ చేతనకు వెలుగులు విరజిమ్మే దారిదీపం గా మారగలదన్న విశ్వాసం తనకు ఉందని శ్రీ షా అన్నారు. మహర్షి అరవిందులను అధ్యయనం చేయనిదే భారత్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరని కూడా కేంద్ర హోం మంత్రి అన్నారు. మహర్షి అరవి oదులు భారత భూత, వర్తమానా లను గురించి రాశారనీ, భారత్ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో కూడా ఆయన భావి తరాల వారికి సూచించారనీ కేంద్ర మంత్రి చెప్పారు. ఒకనాటికి ఖచ్చితంగా విశ్వ గురు స్థానాన్ని భారత మాత మళ్లీ చేజిక్కించుకుంటుందనీ, తన సర్వ శ్రేష్ఠత్వాన్ని పూర్తి ప్రపంచానికి అందించే ప్రయత్నాన్ని చేస్తుందనీ చెప్పింది మహర్షి అరవిందులేనని శ్రీ షా అన్నారు.

పదాలకు, భాషకు ఉన్న శక్తిని గ్రహించాల్సిందిగా యువతరానికి శ్రీ అమిత్ షా విజ్ఞప్తి చేశారు. పదాలను పలికే తీరును మెరుగుపరుచుకోవాలని, వ్యాకరణ సూత్రాలపై పట్టును సాధించి భావ వ్యక్తీకరణను మరింత ప్రభావవంతంగా మార్చుకోవాలని ఆయన సూచించారు. ఇది సమాజంలో యువతకు స్వీకృతిని, విశ్వసనీయతను అనేక రెట్లు పెంచుతుందని ఆయన చెప్పారు.

దేశమంతా ప్రస్తుతం వందే మాతరం గేయానికి 150వ వార్షికోత్సవాన్ని నిర్వహించు కొంటోందని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా గుర్తు చేశారు. ఈ చరిత్రాత్మక సమయంలో పదాల మ్యూజియాన్ని ప్రారంభించు కుంటూ ఉండడం మహత్తర విషయమని ఆయన అన్నారు. ఎవరైనా వేదికపై నిల్చొని వందే మాతరం గేయం పూర్తి ఆలాపనను వింటే, భరత మాత పట్ల దేశంలో ప్రతి ఒక్కరికీ ఎంత భక్తిభావం, గౌరవ భావం ఉన్నాయో ఆ వ్యక్తికి తెలుస్తుందని మంత్రి అన్నారు. ఈ గేయం ఇస్తున్న గొప్ప సందేశం స్వతంత్ర్యానంతరం 76-77 సంవత్సరాల పాటు దేశ ప్రజలకు అందకుండా ఉండిపోయిందని ఆయన అన్నారు. ప్రస్తుతం, వందేమాతరం జాతీయ గేయాన్ని దేశవ్యాప్తంగా పాఠశాలల్లో పూర్తిగా పాడుతూ ఉండటం సంతోషదాయకమని ఆయన చెప్పారు. ఇది ఎంతో ఆనందాన్నిస్తున్న అంశమని కూడా ఆయన అన్నారు.

బెంగాలీ భాషకు 2024లో శాస్త్రీయ భాష హోదాను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చారని శ్రీ అమిత్ షా గుర్తుచేశారు. దేశ ప్రజలు ఇటీవలే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పాటించారని కూడా శ్రీ షా తెలిపారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవ ప్రసంగాన్ని బెంగాలీలో ఇవ్వడంటూ గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ఆహ్వానించింది డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీయే అని శ్రీ షా అన్నారు. బ్రిటిషు హయాంలో, దేశంలో ఏదైనా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవ ప్రసంగాన్ని ఒక భారతీయ భాషలో ఇవ్వడం ఇదే మొదలు అని కూడా ఆయన వెల్లడించారు. ప్రస్తుతం బెంగాల్ మరో సారి 'సోనార్ బాంగ్లా'గా మారే దిశగా ముందుకు సాగుతోందని శ్రీ అమిత్ షా అన్నారు.

భాషను సృష్టించింది తామేనని మానవులు తరుచుగా భావిస్తుంటారని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. అయితే తాను మాత్రం భాషయే మానవ జాతిని తీర్చిదిద్దిందని నమ్ముతున్నానని ఆయన చెప్పారు. 'భావాలు జాగృతం అయినప్పుడు మనిషి నిజంగా మానవతను అలవరుచుకుంటాడు, భాషయే భావాన్ని మేల్కొలుపుతుంది. భాష మూలాధారం పదాలే. అవి కూడా ఒకరి సొంత భాషలోని పదాలే. ఈ వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు ప్రోత్సహించడంలో 'పదాల మ్యూజియం' ఒక ముఖ్య పాత్రను పోషిస్తుంది' అని మంత్రి వివరించారు.

# దేశ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసేలా ఫలప్రదమైన చర్చలకు వేదికగా సమావేశం

న్యూఢిల్లీ, జులై 21:వర్షాకాల సమావేశాలు - 2026 ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పార్లమెంటు ప్రాంగణంలో ఈ రోజు మీడియాతో మాట్లాడారు. కొత్త పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి విచ్చేసిన పాత్రికేయులకు స్వాగతం పలికారు. ప్రకృతి వాతావరణ సరళికి, శాసనపరమైన సత్ఫలితాలకూ మధ్య ఒక ఆలోచనాత్మకమైన పోలికను చెప్పారు. క్రియాశీలక, ముందు చూపుతో కూడిన చర్యలు దేశ సమగ్ర శ్రేయస్సుపై ఎంతగానో ప్రభావం చూపుతాయన్నారు. అంతిమంగా ప్రతి జీవరాశికి ప్రయోజనం చేకూర్చే అత్యంత నిర్మాణాత్మక ఫలితాలు వస్తాయని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. "రుతుపవనాలు క్రియాశీలంగా కొనసాగాలని, పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కూడా ఫలప్రదంగా సాగాలని మేం ప్రార్థిస్తున్నాం" అని శ్రీ మోదీ అన్నారు.

గత నెల రోజులుగా దేశం సాధించిన వరుస అసాధారణ జాతీయ, అంతర్జాతీయ విజయాలను ప్రస్తావిస్తూ.. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠ అమితంగా పెరుగుతుండడం మనకు గర్వకారణమని ప్రధానమంత్రి అన్నారు. సరిగ్గా గతేడాది సమావేశాలకు ముందే ఒక భారతీయ పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రైవేట్ అంతరిక్ష అంకుర సంస్థ స్కైరూట్ ఇటీవలి చరిత్రాత్మక విజయాన్ని కొనియాడారు. కేవలం 28 ఏళ్ల సగటు వయస్సున్న బృందం ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల్లో దేశాన్ని ఒక సరికొత్త యుగంలోకి విజయవంతంగా నడిపించిన తీరు అద్భుతమంటూ ప్రశంసించారు. ఈ విజయాలు దేశ ఆత్మవిశ్వాసాన్ని గణనీయంగా పెంచుతాయన్నారు. "మన యువత నడుపుతున్న ఈ అంకుర సంస్థలు అంతరిక్షంలో భారత పతాక రెపరెపలాడేలా చేశాయి. ఇది మన దేశ ముఖచిత్రాన్ని విశ్వవ్యాప్తం చేయడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అందరి ఆమోదం పొందేలా చేసింది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఇటీవలి ఈ సాంకేతిక విజయాలను దేశ అపరిమిత సామర్థ్యానికి స్పష్టమైన నిదర్శనాలుగా అభివర్ణిస్తూ.. నేటి తరం శక్తిసామర్థ్యాలకు ఎలాంటి హద్దులూ లేవని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ చరిత్రాత్మక విజయాలు భవిష్యత్తులో దేశం మరింత వేగంగా ముందుకు సాగడానికి ఒక అత్యున్నత ప్రేరణాత్మక శక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. "మన యువత సామర్థ్యం, వారి ఆకాంక్షలు అంతరిక్షమంత అపరిమితమైనవన్న బలమైన సందేశాన్ని ఇది అందిస్తోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఈ అపూర్వ పారిశ్రామిక విజయాల మూల కారణాలను ప్రస్తావిస్తూ... ప్రభుత్వం తీసుకువచ్చిన వేగవంతమైన, పరివర్తనాత్మక విధాన మార్పులదే ఈ ఘనత అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న ఈ ప్రగతిశీల వాతావరణం యువ ఆవిష్కర్తలు సాహసాలు చేయడానికి, సరికొత్త విజయాలను అందుకోవడానికి ప్రత్యక్షంగా దోహదపడుతోందన్నారు. "దేశం నేడు ప్రయాణిస్తున్న సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఫలితంగానే మన యువత ఇంతటి ధైర్యసాహసాలను ప్రదర్శిస్తూ విజయం సాధించగలుగుతోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఇటీవల దేశంలో వరుసగా జరిగిన భారీ మౌలిక వసతులు, సాంకేతిక రంగాల ప్రారంభోత్సవాలను ప్రధానమంత్రి సుదీర్ఘంగా ప్రస్తావించారు. రాజస్థాన్‌లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని జాతికి అంకితం చేయడం, దేశంలో మూడో సెమికండక్టర్ ప్లాంటు ప్రారంభోత్సవం, ప్రపంచంలో అత్యంత పొడవైన, అత్యంత శక్తిమంతమైన గ్రీన్ హైడ్రోజన్ రైలు ప్రారంభాన్ని ఆయన ఉదాహరించారు. దేశంలోని ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కార్మికుల సమష్టి అంకితభావం, నిరంతర శ్రమ వల్లే అత్యంత అధునాతనమైన ఈ జాతీయ సంపద సృజన సాధ్యపడిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "ఒకే ఒక్క ఉమ్మడి లక్ష్యంతో దేశం కోసం జీవిస్తూ, శ్రమిస్తున్న మన ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, కార్మికుల సమష్టి కృషికి ప్రత్యక్ష ఫలితమిది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల వల్ల తీవ్రమైన అంతర్జాతీయ ఆందోళనలు తలెత్తుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువులు, రసాయనాల సరఫరా వ్యవస్థల్లో ఏర్పడిన భారీ అంతరాయాలు.. ఇంధనం కోసం దిగుమతులపై ఆధారపడిన దేశాలకు ఎంతటి తీవ్రమైన ముప్పుగా పరిణమించాయో వివరించారు. ఎన్నో తీవ్రమైన అంతర్జాతీయ సవాళ్లు ఉన్నప్పటికీ.. మన దేశం అసాధారణమైన 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం దేశ అద్భుతమైన నిలకడకు, సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. పార్లమెంటరీ ఎజెండాను వివరిస్తూ... దేశం అందుకున్న ఈ వేగవంతమైన ప్రగతి గమనాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాలని అనుభవజ్ఞులైన పార్లమెంటు సభ్యులందరినీ ఆయన కోరారు. దేశభక్తికి అత్యంత ప్రాధాన్యాన్నిస్తూ.. సభలో ప్రతి ఒక్కరి గొంతూ వినిపించేలా, ప్రతి ఆలోచనకూ తగిన గౌరవం దక్కేలా అత్యంత నిర్మాణాత్మకమైన, వాస్తవాలే ప్రాతిపదికగా చర్చలు జరగాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉదయం సోషల్ మీడియా ద్వారా ఎంపీలకు స్పీకర్ స్వాగతం పలికిన విషయాన్ని ప్రస్తావించారు. సభకు అంతరాయం కలిగించే గందరగోళం లేకుండా అర్థవంతమైన చర్చలు జరగాలని పిలుపునిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన ప్రసంగాన్ని ముగించారు. "వాస్తవాలూ, తర్కమూ బలంగా ఉన్న చోట అంతరాయాలకు ఏమాత్రమూ తావుండదు. ప్రశాంతమైన మనస్సుతో కూడా, దేశాన్ని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపేలా శక్తిమంతంగా గళాన్ని వినిపించవచ్చు" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

## గో గ్రీన్-క్లే గణేశ్ ప్రచారానికి పోలీసుల సంపూర్ణ సహకారం



మహబూబ్‌నగర్, జులై 21:జిల్లాలో నిర్వహించనున్న "గో గ్రీన్-సేవ్ ఎన్విరాన్‌మెంట్, క్లే గణేశ్" జిల్లా వ్యాప్త అవగాహన కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు. గణేష్ చతుర్థి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించేందుకు డీసీసీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఎస్పీని కలిసి సహకారం కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల వల్ల చెరువులు, నదులు, జలాశయాలు కాలుష్యానికి గురవుతున్నాయని, ప్రజలంతా పర్యావరణహితమైన మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమానికి పోలీసు శాఖ తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

డీసీసీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, పీఓపీ విగ్రహాల వల్ల కలిగే పర్యావరణ నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, మట్టి గణేశ్ విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి కుటుంబం మట్టి గణేశ్‌ను ప్రతిష్ఠించడం ద్వారా ప్రకృతిని, జలవనరులను, భావితరాల భవిష్యత్తును పరిరక్షించవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, టూ టౌన్ సీఐ ఐజాజుద్దీన్, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, ఫిషరీస్ చైర్మన్ గోనెల శ్రీనివాస్, రాకేష్ శెట్టి, రాజేష్, వినయ్ కుమార్, ఎం. రాజు, పర్యావరణ పరిరక్షణ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో ఈ ప్రచారాన్ని జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# సవాళ్లను స్వీకరించేందుకు సమన్వయం కావాలి

## -మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష

సంగారెడ్డి, జులై 21: (నేటి నిజం ప్రతినిధి):ఎల్నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు.

సంగారెడ్డి,మెదక్ జిల్లాల్లో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్, జహీరాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్ పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు.

ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి వివేక్ ఆదేశించారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ ప్రత్యేక అధికారి ఎ.వాణి ప్రసాద్ మాట్లాడుతూ ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి "జలసిరి" ప్రచార పోస్టర్లను, జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరుల లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక, అంశాలను వివరించారు.

ఈ సమావేశంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ కలెక్టర్ ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్లు పాండు, నగేష్, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్డీవో గున్నాల రాజేందర్, వివిధ మున్సిపాలిటీల ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

# "మాల్డోవా కంపెనీలకు వాణిజ్యం-పెట్టుబడుల దిశగా భారత్ అత్యుత్తమ వ్యాపారావకాశాలను కల్పిస్తుంది"

న్యూఢిల్లీ, జులై 21:రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, మోల్డోవా అధ్యక్షుడు గౌరవనీయ మైయా సాండూ ఈ రోజు చిసినౌలో నిర్వహించిన భారత-మాల్డోవా వాణిజ్య సదస్సులో పాల్గొన్నారు.

భారత్-మాల్డోవా దౌత్య సంబంధాలు 1992లో మొదలైన నాటినుంచీ రెండు దేశాల మధ్య ఆత్మీయ, స్నేహ బంధం మరింత పటిష్టమవుతూ వచ్చిందని రాష్ట్రపతి తన ప్రారంభోపన్యాసంలో గుర్తుచేశారు. పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, శాంతి, ప్రగతి, అంతర్జాతీయ సహకారం తదితరాలపై సమష్టి నిబద్ధత ప్రాతిపదికగా ఈ భాగస్వామ్యం వర్ధిలుతున్నదని ఆమె పేర్కొన్నారు.

భారత్ 'వికసిత భారత్-2047' స్వప్న సాకారం వైపు పురోగమిస్తున్న నేపథ్యంలో విశ్వాసం, ఉమ్మడి సౌభాగ్యం ఆధారిత భాగస్వామ్యాలను ఆకాంక్షిస్తున్నాని రాష్ట్రపతి అన్నారు. వ్యవస్థాపన, డిజిటల్ పరివర్తన, తయారీ రంగంలో నాణ్యత, యువ-నిపుణ శ్రామికశక్తి గల భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందని తెలిపారు. మరోవైపు మోల్డోవా కూడా సంస్కరణాధారిత దృక్పథం, వ్యూహాత్మక భౌగోళిక స్థానం, ప్రతిభగల మానవ వనరులతో ముందడుగు వేస్తున్నదని చెప్పారు. అలాగే, ఐరోపా విపణులతో మాల్డోవా అనుసంధానం ఇనుమడిస్తోందని, భారతీయ వాణిజ్య సంస్థలకూ ఇది ప్రధాన గమ్యంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు.

డిజిటల్ సాంకేతికతలు, కృత్రిమ మేధ, సైబర్ భద్రత, సాంకేతికార్థిక ప్రగతి, సార్వజనీన మౌలిక సదుపాయాలు, భౌతిక మౌలిక వసతుల కల్పన, పునరుత్పాదక ఇంధనం, అధునాతన తయారీ, వ్యవసాయం, ఆహార తయారీ, ఔషధాలు, జీవసాంకేతికత, ఆరోగ్య సంరక్షణ వంటి విభిన్న రంగాల్లో సహకారానికి అపార అవకాశాలున్నాయని రాష్ట్రపతి ఏకరవు పెట్టారు. సౌరశక్తి, బ్యాటరీ నిల్వ, స్మార్ట్ గ్రిడ్‌లు, గ్రీన్ హైడ్రోజన్, ఇతర కాలుష్య రహిత సాంకేతికతలు సహా పునరుత్పాదక ఇంధన రంగంలో మోల్డోవా అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించేందుకు భారతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

వాణిజ్యం-పెట్టుబడుల దిశగా మోల్డోవా కంపెనీలకు భారత్ అత్యుత్తమ అవకాశాలు కల్పిస్తుందని రాష్ట్రపతి అన్నారు. పారదర్శకత, అనుసరణీయ విధానాలు, పెట్టుబడిదారు హిత వ్యాపార వాతావరణ సృష్టికి భారత్ కట్టుబడి ఉందని చెప్పారు. తదనుగుణంగా అవకాశాల అన్వేషణ కోసం భారత్ రావాల్సిందిగా మోల్డోవా వ్యాపార సంస్థలకు ఆమె ఆహ్వానం పలికారు.

అదే క్రమంలో మోల్డోవాలోగల వ్యాపార అవకాశాలను అన్వేషించాల్సిందిగా భారత వాణిజ్య సంస్థలకూ రాష్ట్రపతి సూచించారు. శాశ్వత ఆర్థిక భాగస్వామ్యాల దిశగా భారత వాణిజ్యవేత్తల వ్యాపార స్ఫూర్తి, దార్శనికత, నిబద్ధతలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె అన్నారు. ఈ వాణిజ్య సదస్సులో చర్చల ద్వారా కొత్త భాగస్వామ్యాలకు, వినూత్న సహకారానికి పునాది పడుతుందని, రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారం ఉన్నత శిఖరాలకు చేరగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

వ్యవసాయం, ఆహార తయారీ, సమాచార సాంకేతికత, ఔషధ, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం, విద్య, లాజిస్టిక్స్, డిజిటల్ సాంకేతికతలు సహా వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహించే రెండు దేశాల ప్రసిద్ధ వాణిజ్య సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి




నిజామాబాద్, జులై 21:ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హౌసింగ్ ఏఈ సుచిత్ర సూచించారు.

సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, లబ్ధిదారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలపై హౌసింగ్ ఏఈ సుచిత్ర అవగాహన కల్పించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ముందు భాగంలో మూడు అడుగులు, మిగిలిన మూడు వైపులా ఒక్కో అడుగు వరకు మాత్రమే స్లాబ్ నిర్మించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి లబ్ధిదారు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మహిళలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.


# ఉద్యోగుల జీపీఎఫ్ నిధుల మంజూరులో జాప్యంపై ఆగ్రహం

## -తక్షణమే పెండింగ్ క్లెయిమ్‌లను విడుదల చేయాలని టీఎన్‌యూఎస్ జిల్లా శాఖ డిమాండ్



మహబూబ్‌నగర్, జులై 21:జిల్లా పరిషత్ ఉద్యోగుల జీపీఎఫ్ (ఉఖఈ) పార్ట్ ఫైనల్స్, అడ్వాన్స్‌ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (ుఔజూ) మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారికి సోమవారం వినతి పత్రం సమర్పించింది. జిల్లా పరిషత్‌లో 2025 అక్టోబర్ 21 నుంచి జీపీఎఫ్ పార్ట్ ఫైనల్స్, అడ్వాన్స్‌ల మంజూరు నిలిచిపోయిందని, అత్యవసర అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం పేర్కొంది. సాంకేతిక సమస్యల పేరుతో ఉద్యోగులను నిరీక్షింపజేయడం సరైన విధానం కాదని, పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేసింది.అదేవిధంగా, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల జీపీఎఫ్ క్లెయిమ్‌లను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా శాఖ అధ్యక్షుడు మామిళ్ళ లక్ష్మణ్ గౌడ్, జిల్లా శాఖ కార్యదర్శి కె. వెంకట నారాయణ వినతిపత్రంలో కోరారు.

# ఎంఎస్ అగర్వాల్ కంపెనీని తొలగించాలి: గ్రామస్థుల డిమాండ్




మెదక్, జులై 21: మనోహరాబాద్ మండలం చెట్లగౌరారం, రంగయ్యపల్లి గ్రామాల సమీపంలోని ఎంఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ కంపెనీని వెంటనే తొలగించాలని కోరుతూ రెండు గ్రామాలకు చెందిన సుమారు 400 మంది గ్రామస్థులు సోమవారం మెదక్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ నియోజ కవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము, శబ్ద కాలుష్యంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాలుష్యం కారణంగా తాగునీటి వనరులు కలుషితమయ్యాయని, పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు చర్మ, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కంపెనీని తొలగించడం సాధ్యం కాకపోతే రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజల మధ్య జరగాల్సిన హియరింగ్‌ను పోలీసుల సమక్షంలో నిర్వహించడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామాలకు వచ్చి బహిరంగ హియరింగ్ నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే వేలాదిమందితో మళ్లీ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రామస్థులు మాట్లాడుతూ, కంపెనీ కాలుష్యం కారణంగా ఇళ్లపై నల్లటి దుమ్ము పేరుకుపోతుండటంతో పాటు వర్షపు నీరు, చెరువులు, బోర్లు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీని వెంటనే తొలగించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రూ. 37,500 కోట్ల విలువైన ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ పథకం ముందస్తు దరఖాస్తు సమావేశం.. పారిశ్రామిక వర్గాల నుంచి విశేష స్పందన

న్యూఢిల్లీ, జులై 21:ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహకం కోసం ఉద్దేశించిన రూ. 37,500 కోట్ల పథకానికి సంబంధించిన ముందస్తు దరఖాస్తుల సదస్సును బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా అధ్యక్షతన మంత్రిత్వ శాఖ విజయవంతంగా నిర్వహించింది. స్వదేశీ బొగ్గును పర్యావరణహితంగా, విలువ ఆధారితంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంపై పరిశ్రమల వర్గాలు భారీ ఆసక్తి చూపాయి. ఈ సదస్సులో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, సాంకేతికత నిపుణులు, దరఖాస్తుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సమావేశంలో పథకం మార్గదర్శకాలు, ప్రతిపాదనల కోసం అభ్యర్థనపై (ఆర్ఎఫ్‌పీ) మంత్రిత్వ శాఖ పూర్తిస్థాయిలో స్పష్టతను అందించింది. అర్హత ప్రమాణాలు, మూల్యాంకన విధానం, ఆర్థిక ప్రోత్సాహకాలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన అంశాలను వివరించడంతో పాటు భాగస్వాములు అడిగిన సందేహాలకు సమాధానమిచ్చింది.

# ఏపీఈడీఏ సహకారంతో ఉత్తరాఖండ్ నుంచి ఇరాక్‌కు

## 24 మెట్రిక్ టన్నుల ఫ్రోజెన్ ఫ్రెంచ్ ఫ్రైస్ తొలి ఎగుమతి

న్యూఢిల్లీ, జులై 21:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) సహకారంతో ఉత్తరాఖండ్‌లోని ఉద్ధం సింగ్ నగర్ జిల్లా కాశీపూర్ నుంచి 24 మెట్రిక్ టన్నుల ఫ్రోజెన్ ఫ్రెంచ్ ఫ్రైస్ ఇరాక్‌కు తొలిసారిగా ఎగుమతి అయింది. విరున్ గ్లోబల్ ట్రేడ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ చేపట్టిన ఈ ఎగుమతి, భారత శుద్ధి చేసిన ఆహార ఎగుమతుల పరిధిని విస్తరించడంతో పాటు ఉత్తరాఖండ్ నుంచి విలువ ఆధారిత వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది.

ఈ ఉత్పత్తి నాణ్యత అంతర్జాతీయ మార్కెట్లలో మళ్లీ మళ్లీ ఆర్డర్లు రావడానికి, సుదీర్ఘకాల వ్యాపార సంబంధాలకు దారితీస్తుందని, సంస్థతో పాటు ఈ ప్రాంతానికి నిరంతర ఎగుమతి అవకాశాలను సృష్టిస్తుందని ఎగుమతిదారు ధీమా వ్యక్తం చేశారు. సియాల్ (ఎస్ఐఏఎల్), గల్ఫ్‌ఫుడ్, ఇండస్‌ఫుడ్, వరల్డ్ ఫుడ్ ఇండియా వంటి ప్రముఖ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనల్లో ఎగుమతిదారు పాల్గొనేందుకు ఏపీఈడీఏ మద్దతు ఇచ్చింది. ఇది మార్కెట్ విస్తరణకు, అంతర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానం కావడానికి తోడ్పడింది.

శుద్ధి వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచ సరఫరాదారుగా భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. 2025–26లో భారతదేశ ప్రాసెస్ చేసిన కూరగాయల ఎగుమతులు 7,26,874.70 మెట్రిక్ టన్నులకు చేరుకుని, 932.25 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధించాయి. ఇందులో విలువ ఆధారిత బంగాళాదుంప ఉత్పత్తుల ఎగుమతులు 2,77,108.51 మెట్రిక్ టన్నులుగా నమోదు కాగా, వాటి విలువ 289.40 మిలియన్ డాలర్లుగా ఉంది. ఈ సంవత్సరంలో ఏపీఈడీఏ నిర్దేశిత ఎగుమతుల్లోలో ప్రాసెస్ చేసిన పండ్లు, కూరగాయలు రెండూ కలిసి దాదాపు 10 శాతంగా ఉన్నాయి.

ఉత్తరాఖండ్ వంటి తీరప్రాంతం లేని రాష్ట్రాల నుంచి జరిగే ఎగుమతుల పోటీతత్వాన్ని రవాణా ఖర్చులు ప్రభావితం చేస్తూనే ఉన్నాయని ఏపీఈడీఏ ఛైర్మన్ శ్రీ అభిషేక్ దేవ్ తెలిపారు. ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరచడానికి, ఎగుమతిదారులకు విస్తృత మార్కెట్ అందుబాటును కల్పించడానికి రవాణా సహాయక నిబంధనలతో సహా రాష్ట్ర వ్యవసాయ ఎగుమతి విధానం రూపకల్పన, అమలుపై ఉత్తరాఖండ్ ప్రభుత్వంతో ఏపీఈడీఏ కలసి పనిచేస్తోందని ఆయన వెల్లడించారు.

ఉత్తరాఖండ్‌లో విస్తరిస్తున్న ఆహార శుద్ధి పరిశ్రమ, నాణ్యమైన ముడి ఉత్పత్తులకు నిరంతర డిమాండును సృష్టిస్తోంది. స్థానికంగా విలువ జోడింపును ప్రోత్సహిస్తూ, ఎగుమతి ఆధారిత సరఫరా వ్యవస్థలలో ఎక్కువ వుంది భాగస్వాములయ్యేలా ప్రోత్సహిస్తూ వ్యవసాయ విలువ వ్యవస్థ అంతటా బలమైన మార్కెట్ అవకాశాలను ఏర్పరుస్తోంది. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన మార్కెట్ సౌకర్యాల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు రాష్ట్ర ఆహార శుద్ధి ఎగుమతులను గణనీయంగా పెంచుతాయని భావిస్తున్నారు.

ఎగుమతి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, ప్రపంచ మార్కెట్లకు ప్రాప్యతను సులభతరం చేయడానికి, భారత్ నుంచి విలువ ఆధారిత వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, ఎగుమతిదారులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ప్రాసెసర్లు, ఇతర వాటాదారులతో ఏపీఈడీఏ కలసి పనిచేస్తూనే ఉంది.

# 'ఆపరేషన్ వజ్ర' 12 కోట్ల 'ఫైటర్ డ్రగ్'గా పిలిచే ట్రమడాల్ హైడ్రోక్లోరైడ్

న్యూఢిల్లీ, జులై 21:సుమారు 30 మెట్రిక్ టన్నుల (30,000 కిలోలు) బరువున్న 12 కోట్ల (120 మిలియన్ల) అధిక సాంద్రత గల ట్రమడాల్ హైడ్రోక్లోరైడ్ (250ఎంజీ) మాత్రల అక్రమ రవాణాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన రెవెన్యూ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) భగ్నం చేసింది. ఈ కేసులో బెంగళూరు నుంచి ఒకరిని, కొచ్చి నుంచి ఇద్దరిని? మొత్తం ముగ్గురు కీలక వ్యక్తులను అరెస్టు చేసింది.

ప్రాథమిక విచారణ ప్రకారం.. 'గినియా–బిసావు'కు పంపుతున్నట్లు చెప్పినప్పటికీ ఈ సరుకును వాస్తవానికి 'లిబియా'కు మళ్లించే ప్రణాళికలో నిందితులు ఉన్నట్లు తెలిసింది. ఢిల్లీలోని ఒక గోదాం నుంచి ఈ మొత్తం సరుకును స్వాధీనం చేసుకోవడం ద్వారా ఇది అంతర్జాతీయ అక్రమ రవాణా మార్గాల్లోకి తరలిపోకుండా అధికారులు అడ్డుకున్నారు.

'ఆపరేషన్ వజ్ర' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌ను గ్వాలియర్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ ప్రివెంటివ్ టీమ్‌లు 2026 జూలై 10 నుంచి 20 వరకు బెంగళూరు, ఢిల్లీ, కొచ్చిలలో నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) బెంగళూరు, డీఆర్ఐ కొచ్చి, ఇతర ఏజెన్సీలు ఎంతో ప్రభావవంతంగా, సమర్థవంతంగా సమన్వయం చేసుకున్నాయి.

గినియా–బిసావుకు చేరాల్సిన 12 కోట్ల (120 మిలియన్ల) ట్రమడాల్ మాత్రలను లిబియాకు మళ్లించాలన్న ప్రణాళికల్లో ఉన్నట్లు నిఘా సమాచారాన్ని సేకరించారు. సీబీఎన్ సమర్థవంతమైన రిస్క్–ఆధారిత ఎగుమతి నియంత్రణ వ్యవస్థ కింద తనిఖీ చేసినప్పుడు అనేక సందేహాస్పద అంశాలు బయటపడ్డాయి. దీనితో లోతైన విచారణ, ఏజెన్సీల సమన్వయం వేగవంతమైంది. అనంతరం గినియా–బిసావుకు చెందిన ఇంటర్నేషనల్ నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డ్ (ఐఎన్‌సీబీ) అధికారులతో కలిసి సీబీఎన్ జరిపిన విచారణలో చెప్పిన గమ్యస్థానం తప్పని తేలింది. తద్వారా ఈ సరుకును అక్రమంగా మళ్లించే కుట్ర కోణం బహిర్గతం అయింది.

తనిఖీల్లో తేలిన అంశాల ఆధారంగా సీబీఎన్ బెంగళూరులో సమన్వయంతో కూడిన చర్యలు చేపట్టింది. ఎన్‌డీపీఎస్ చట్టం– 1985లోని సంబంధిత నిబంధనల ప్రకారం బెంగళూరుకు చెందిన లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ (ఎల్ఎల్‌పీ) కింద నమోదైన సంస్థ డైరెక్టర్‌ను అరెస్టు చేసింది. తదుపరి విచారణలో వీళ్ల సూత్రధారులు కేరళ నుంచి పనిచేస్తున్నట్లు తేలింది. చట్టం నుంచి తప్పించుకోవడానికి వారు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ నిరంతర ఇంటెలిజెన్స్ సమాచారంతో కొచ్చిలో మిగిలిన ఇద్దరు కీలక సూత్రధారులను కూడా అధికారులు పట్టుకున్నారు. నిందితులు ముగ్గురినీ ఎన్‌డీపీఎస్ చట్టం–1985 కింద అరెస్టు చేశారు. ప్రస్తుతం తదుపరి విచారణ కొనసాగుతోంది.

సీబీఎన్ ఇండియా అప్రమత్తత ఫలితంగా తీవ్రమైన ఘర్షణలు జరుగుతున్న యుద్ధ ప్రాంతాల్లోకి భారీ స్థాయిలో అక్రమ సింథటిక్ ఓపియాడ్ డ్రగ్స్ ప్రవేశించకుండా అడ్డుకోగలిగారు. గ్లోబల్ ఫార్మాస్యూటికల్ సరఫరా వ్యవస్థ భద్రత కోసం జాతీయ ఏజెన్సీల మధ్య సహకారం, అంతర్జాతీయ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య రిస్క్ ఆధారిత ప్రొఫైలింగ్, నిరంతర ఇంటెలిజెన్స్ సమాచార మార్పిడి ప్రాముఖ్యతను ఈ ఆపరేషన్ చాటిచెప్పింది.

'ఆపరేషన్ వజ్ర' విజయవంతంగా నిర్వహించడం అనేది అంతర్జాతీయ సరిహద్దులు దాటి జరిగే వ్యవస్థీకృత డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడంలో ఇంటెలిజెన్స్ ఆధారిత చర్యలు, విభిన్న ఏజెన్సీల మధ్య సమన్వయం, అంతర్జాతీయ సహకారానికి ఉన్న శక్తిని స్పష్టంగా తెలియజేస్తోంది. ఎన్‌డీపీఎస్ చట్టం–1985 కింద భారతదేశానికి ఉన్న బలమైన నియంత్రణ వ్యవస్థను ఇది చాటిచెబుతోంది.

భారత ప్రభుత్వ స్వప్నమైన 'నషా ముక్త్ భారత్' సాధనలో భాగంగా ఔషధాల సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించడంలో దేశ చట్టపరమైన నియంత్రణ వ్యవస్థను పరిరక్షించడానికి, అంతర్జాతీయ డ్రగ్స్ ట్రాఫికింగ్ ముఠాలను పూర్తిగా అంతమొందించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది.

# ఉడుంపూర్ తాండాలో ఘనంగా శీతల భవాని పండుగ వేడుకలు

## పంటల సమృద్ధి, ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు



ఆదిలాబాద్, జులై 21:బంజారా గిరిజనుల ఆరాధ్య దైవమైన శీతల భవాని పండుగను నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఉడుంపూర్ తాండాలో మంగళవారం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గిరిజనులు శీతల భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండాలని, పశు సంపద అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

పండుగ సందర్భంగా తాండాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఉడుంపూర్ తాండా గ్రామ పెద్దలు, గిరిజనులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

ములుగు, జులై 21: (నేటినిజం ప్రతినిధి):ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో 76.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. స్థానికంగా కురిసిన వర్షాలతో పాటు ఎగువన కురిసిన భారీ వర్షాలతో తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్నది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాని అధికారులు సూచించారు.

# ప్రజావాణిలో 82 దరఖాస్తులు

ములుగు, జులై 21: (నేటినిజం ప్రతినిధి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 82 దరఖాస్తులను స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ సంపత్‌రావు తెలిపారు. భూ సమస్యలపై 22, ఇండ్ల కోసం 18, పింఛన్ల కోసం 17, ఇతర శాఖలకు 25 ఫిర్యాదులు అందాయని, తక్షణ పరిష్కారం కోసం వాటిని సంబంధిత శాఖలకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ రహదారి వెంట ఉన్న 9వ వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు సురేందర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, తిరుపతి, రమేశ్, గోవర్ధన్, విజయ, గంద్రకోట కుమార్ ఫిర్యాదు చేశారు. అలాగే, ఎస్సీ రిజర్వేషన్ల కింద ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులను ఎస్సీలకే కేటాయించాలని కోరుతూ మహాజన్ సోసలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్ఓ రవికుమార్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కుషీల్, అధికారలు పాల్గొన్నారు.

# ఆగస్టు 3లోగా 100 శాతం సర్వే పూర్తయ్యేలా కృషి చేయాలి: ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్

ఆదిలాబాద్, జులై 21: ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సర్వేపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పార్టీ నాయకులు, బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పాల్గొని సర్వే 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు.

మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్వేపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండలాలు, గ్రా మాల వారీగా ఇప్పటివరకు న మోదైన సర్వే పురోగతిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఆగస్టు 3 వరకు కొనసాగనున్న ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి నాయకుడు బాధ్యతగా పాల్గొని, గ్రామాల్లో ఒక్క ఓటరు కూడా మిగలకుండా ఫారాలను బీఎల్ఓలకు అందజేసి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఈ సర్వే అత్యంత కీలకమని, దీనిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు.

# ఆషాడ మాసంలో ఉత్సవాలకు ముస్తాబైన తోట్ల ఎల్లమ్మ



వికారాబాద్, జులై 21: ఆషాడ మాస ఉత్సవాల కోసం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లి తోట ఎల్లమ్మ ప్రాంతంలో గల శ్రీ ఎల్లమ్మ దేవత ముస్తాబయింది. ఆలయ అర్చకులు ఎల్లమ్మ దేవతను వేప కొమ్మలతో పూలతో అలంకరించారు. ఆషాడ మాస మంగళవారం కావడంతో వికారాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ఎల్లమ్మ దేవతను దర్శించుకుంటున్నారు. శ్రీ తోట్ల ఎల్లమ్మ ఆలయం రోజురోజుకు అభివృద్ధి సాధిస్తుంది. ఎర్నే పలికి వచ్చిందా జగ్గరీ రత్నారెడ్డి తదితరులు ఈ ఆలయం అభివృద్ధి కోసం ఎనీత గానో కృషి చేశారు.

# గుంతల రోడ్డులో అదుపుతప్పిన లోడ్ ట్రాక్టర్

## –పల్టీ కొట్టిన ట్రాలీ.. తృటిలో తప్పిన ప్రమాదం




వరంగల్, జులై 21: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని వనకబండ చౌరస్తా నుంచి రాజన్నగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై గుంతల కారణంగా పొట్టు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాలీ పల్టీ కొట్టింది. మంగళవారం ఉదయం మోత్కూర్‌లోని ఓ రైస్ మిల్లులో పొట్టు లోడ్ చేసుకుని భువనగిరి రోడ్డువైపు వెళ్తున్న ట్రాక్టర్ (టీఎస్ 30 టీఏ 6648) టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో గుంతలమయంగా మారిన రోడ్డులో అదుపుతప్పడంతో ట్రాలీ పూర్తిగా బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వనకబండ చౌరస్తా?రాజన్నగూడెం డబుల్ బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో కొన్నేళ్లుగా రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకయాతనగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

# హైదరాబాద్‌లో 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్ 2026ను నిర్వహించనున్న సీఐఎస్ఎఫ్




న్యూఢిల్లీ, జులై 21:అఖిల భారత పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఏఐపీఎస్‌సీబీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) నిర్వహించే 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్– 2026 హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జూలై 23 నుంచి 30 వరకు జరగనుంది.

ఈ ఛాంపియన్‌షిప్‌లో 36 రాష్ట్ర పోలీస్, కేంద్ర సాయుధ భద్రతా దళాల (సీఏపీఎఫ్) సంస్థలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని జూడో, వుషు, టేక్వాండో, కరాటే, పెంచాక్ సిలాట్ క్రీడాంశాలలో పోటీపడనున్నారు. ఆయా జాతీయ సమాఖ్యలకు చెందిన దాదాపు 150 మంది సాంకేతిక అధికారులు ఈ పోటీలను పర్యవేక్షించనున్నారు.

నేడు హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో (ఎన్ఐఎస్ఏ) నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో (కర్టెన్ రైజర్–కమ్–ప్రెస్ కాన్ఫరెన్స్) ఈ ఛాంపియన్‌షిప్ వివరాలను వెల్లడించారు. మీడియాను ఉద్దేశించి ఎన్ఐఎస్ఏ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్ సోహి మాట్లాడుతూ.. ఈ ఛాంపియన్‌షిప్ పోలీస్, సీఏపీఎఫ్ సిబ్బందిలో క్రీడా సంస్కృతిని పెంపొందించడంతో పాటు అథ్లెట్లు తమ ప్రతిభను, క్రీడా నైపుణ్యాన్ని చాటుకోవడానికి ఒక జాతీయ వేదికను అందిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి హాజరైన ఒలింపియన్ శ్రీ పారుపల్లి కశ్యప్, ప్రముఖ రోయింగ్ కోచ్ శ్రీ ఇస్మాయిల్ బైగ్ మాట్లాడుతూ.. యూనిఫాం ధరించే దళాలలో క్రమశిక్షణ, సహనశీలత, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉద్ఘాటించారు. ఈ ఛాంపియన్‌షిప్ అథ్లెట్లను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆసియా క్రీడలు– 2026 రానున్న వేళ ఈ ఛాంపియన్‌షిప్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇందులో పోటీపడుతున్న అయిదు క్రీడల్లో జూడో, వుషు, టేక్వాండో, కరాటేలు ఆసియా క్రీడల్లో కూడా ఉన్నాయి. పోలీస్, సీఏపీఎఫ్‌లకు చెందిన అథ్లెట్లకు అంతర్జాతీయ స్థాయికి ఉపయోగపడే విలువైన పోటీ అనుభవాన్ని ఇది అందించనుంది.

తెలంగాణ రాష్ట్ర జంతువైన మచ్చల జింక (చిటాల్) ఆధారంగా రూపొందించిన ఈ ఛాంపియన్‌షిప్ మస్కట్ 'వీరా'ను ఆవిష్కరించారు. ఇది సజీవత, ప్రభావశీలత, సహనశీలత, చురుకుదనం అనే గుణాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది మార్షల్ ఆర్ట్స్, భద్రతా దళాల స్ఫూర్తిని తెలియజేస్తోంది.

ఈ కార్యక్రమానికి తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఇతర భాగస్వామ్య సంస్థలు రవాణా, నిర్వహణ సహకారాన్ని అందిస్తున్నాయి. నిర్ణీత నిబంధనలకు అనుగుణంగా నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) యాంటీ–డోపింగ్ పరీక్షలను నిర్వహిస్తుంది. పాల్గొనే క్రీడాకారులు, అధికారుల కోసం సమగ్రమైన వైద్య, వసతి ఏర్పాట్లను చేశారు.

# న్యాయ వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో 8వ బ్రిక్స్ దేశాల ప్రాసిక్యూషన్ సర్వీసెస్ అధిపతుల సమావేశం

న్యూ ఢిల్లీ, జులై 21:ప్రతిష్ఠాత్మక బ్రిక్స్–2026 నేపథ్యంలో భారత ప్రభుత్వ చట్ట, న్యాయ మంత్రిత్వ శాఖ పరిధిలోని న్యాయ వ్యవహారాల విభాగం జూలై 20 నుంచి 21, 2026 తేదీల్లో బ్రిక్స్ దేశాల ప్రాసిక్యూషన్ సర్వీసెస్ అధిపతుల 8వ సమావేశాన్ని వర్చువల్ పద్ధతిలో నిర్వహిస్తోంది. భారత అటార్నీ జనరల్ శ్రీ ఆర్. వెంకట రమణి అధ్యక్షతన జరుగుతున్న ఈ కీలక అధికారిక చర్చల్లో సభ్య దేశాల ప్రాసిక్యూషన్ అధిపతులు పాల్గొంటారు. ఈ కీలక సమావేశం భారతదేశ దార్శనికత "పటిష్ఠమైన, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత గల దేశ నిర్మాణం"ను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తుంది. సభ్య దేశాల ప్రాసిక్యూషన్ నాయకత్వాన్ని ఒకే తాటిపైకి తీసుకురావటం ద్వారా బ్రిక్స్ కూటమి దేశాల్లో ఆర్థిక వృద్ధికి సహకరించే స్థిరమైన, నిష్పాక్షికమైన, స్పష్టమైన వ్యవస్థలను పెంపొందించేందుకు ఉమ్మడి నిబద్ధతను ఈ సమావేశం స్పష్టం చేస్తుంది.

ఈ వర్చువల్ సమావేశం "నేర విచారణలో ప్రాసిక్యూషన్ దృక్పథం నుంచి అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం మార్చుకోవటం" ఇతివృత్తంపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఇది ప్రస్తుత కాలానికి అనువైన, సమయోచితమైన ఇతివృత్తం. ఈ రెండు రోజుల పాటు ఆధునిక సంస్థాగత సవాళ్లపై సీనియర్ నాయకులు చర్చించటంతో పాటు న్యాయ నిర్ణయ ప్రక్రియకు సంబంధించిన కీలక విధానాలను పంచుకుంటారు. గత సమావేశాల్లో ప్రారంభమైన డిజిటల్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ? కృత్రిమ మేధ, న్యాయ సూత్రాలను రోజువారీ ఆచరణాత్మక విధానాల్లోకి తీసుకురావటంపై ఈ చర్చలు సాగుతాయి. సాంకేతికతతో కూడిన న్యాయ నిర్ణయాన్ని పరిశీలించటం ద్వారా క్రిమినల్ విధానాల డిజిటలైజేషన్, ఎలక్ట్రానిక్ సాక్ష్యాల నిర్వహణ, నిర్దేశిత సమయ పరిమితితో విచారణలను పూర్తి చేయటం వంటి కీలక అంశాలపై ఈ సమావేశం దృష్టి సారిస్తుంది.

నేర న్యాయ వ్యవస్థను మరింత సున్నితంగా, పారదర్శకంగా, బాధితుల వైపు నిలిచేలా మార్చటం.. ఈ ఏడాది చర్చల ముఖ్య ఉద్దేశం. ప్రాసిక్యూషన్ విభాగాల పనితీరును మెరుగుపరచటానికి, వాటిపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచటానికి సభ్య దేశాలు ప్రత్యేక అనుభవాలను పంచుకుంటాయి. ఆర్థిక నేరాలు, సైబర్ బెదిరింపులు, పర్యావరణ ఉల్లంఘనల వంటి క్లిష్టమైన ఆధునిక సవాళ్లను ఎదుర్కోవటానికి బలమైన అంతర్జాతీయ సహకారం అవసరమని ఈ సమావేశం గుర్తిస్తోంది. తరచూ చర్చల నిర్వహణ ద్వారా పరస్పర చట్టపరమైన సహాయం, అంతర్జాతీయ సాక్ష్యాల సేకరణ వ్యవస్థలను పటిష్టం చేయటంతో పాటు ప్రాసిక్యూటర్ల వృత్తిపరమైన సామర్థ్య పెంపొందింపును ప్రోత్సహించటం ఈ సమావేశం లక్ష్యం.

# తెలంగాణ వైతాళిక కవినేత దాశరథి

## జూలై 22... దాశరథి కృష్ణమాచార్య జయంతి




తెలంగాణలో జన్మించిన గొప్ప వైతాళికులలో, మహాకవి దాశరథి అగ్ర శ్రేణికి చెందిన వారు. హైదరాబాద్ సంస్థాన విముక్తి మహె?ద్యమంలో దూకి, నిజాం నవాబు అలీఖాన్ ను ఎదిరించి, తెలంగాణ విముక్తికై కారాగార శిక్ష అనుభవించి, లక్ష్యాన్ని సాధించిన స్వాతంత్రోద్యమ కవి సింహం దాశరథి.

దాశరథిగా సుపరిచితులు అయిన దాశరథి కృష్ణమాచారి 1925 జూలై 22 నాడు, ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా, చినగూడూరు గ్రామంలో శ్రీమతి వేంకటమ్మ, శ్రీమాన్ వేంకటాచార్యులకు జన్మించారు. దాశరథి రంగాచారి దాశరథి ఆయన తమ్ముడు.

చినగూడూరులో నాల్గవ తరగతినీ, ఖమ్మం ఉస్మానియా హైస్కూల్ లో మెట్రిక్యులేషన్ నూ పూర్తి చేశారు. ఖమ్మంలో చదువు కుంటున్నప్పుడే మీర్జా గాలిబ్ శృంగారాత్మక సాహిత్యాన్ని, ఇక్బాల్ విప్లవ గీతాలను అధ్యయనం చేశారు. మరోవైపు ఉపనిషత్తుల సారాన్ని ఎదనిండా నింపు కున్నారు దాశరథి.

**"నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనొ అందాక ఈ భూగోళమ్మున అగ్గి పెట్టెదను"** అంటూ విప్లవ చైతన్య మూర్తియై ప్రజ్వరిల్లినారు. ప్రజల బాధలకు,కారణ భూతులైన భూస్వాముల ఆటకట్టించాలనీ, రైతుల హక్కుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులతో కలిసిపోయారు. కార్యకర్తగా, కావ్యకర్తగా ఉద్యమించారు. కోయగూడేలలో తిరిగి వాళ్లను సమైక్య పరచారు. లంబాడీలను, హరిజనులను, రైతులను, కూలీలను, వర్తకులను మేల్కొలిపి, వాళ్లను స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా చేశారు. పుంఖానుపుంఖంగా కవితలు రచించి, పీడిత ప్రజల, భావాలకు ప్రతినిధిగా తన కలాన్ని ఝళిపించారు.

తెలుగు భాషా సంస్కృతుల పునరుద్ధరణ కోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో పాల్గొని, కావ్యగానం చేసేవారు దాశరథి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవ సభ 1944 లో ఓరుగల్లు కోటలో ఏర్పాటైంది. రజాకార్లు సభపై వేసిన పచ్చని పందిళ్లను తగులబెట్టారు. అప్పుడు దాశరథి నిర్భయంగా- **"జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని, కవి సమ్మేళనం జరిపి తీరుతాం"** అంటూ గళం విప్పి

**"ఓ పరాధీన మానవా! ఓపరాని
దాస్యము విదల్చ లేని శాంతమ్ము మాని,
తలుపులను ముష్టి బంధాన కలచివైచి, చొచ్చుకొని
పొమ్ము స్వాతంత్ర్య సురపురమ్ము"** అంటూ ప్రబోధించారు. సభాధ్యక్షులైన సురవరం ప్రతాపరెడ్డి వెంటనే లేచి 'సింహగర్జన చేశావు నాయనా' అంటూ దాశరథిని మెచ్చుకొన్నారు. దేవులపల్లి రామానుజ రావు దాశరథి మెడలో పుష్పహారం వేసి కౌగలించుకొన్నారు. తరువాత 'మంచిర్యాల'లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభా కవి సమ్మేళనానికి, దాశరథి అధ్యక్షత వహించి ప్రజలను ప్రబోధించారు.

1945-46 ప్రాంతంలో దాశరథికి కమ్యూనిస్ట్ లతో అభిప్రాయ భేదాలేర్పడ్డాయి. అప్పుడు దాశరథి హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడానికీ, మహె?ద్యమాన్ని సాగిస్తున్న ' స్టేట్ కాంగ్రెసు' లో చేరినారు. స్వామి రామానందతీర్థ నాయకత్వంలో, జమాలాపురం కేశవరావు, కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు మొదలగు వారితో కలసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు.

**"ఇదేమాట ఇదేమాట పదేపదే అనేస్తాను"** అంటూ, "నిజాం రాజు జన్మజన్మల బూజు" అంటూ, ఉద్యమ కవితావేశ మూర్తియై, దాశరథి సత్యాగ్రహానికి తలపడ్డారు. అప్పటి దాకా పొంచి ఉన్న పోలీసులు 'గార్ల ' గ్రామంలో, దాశరథిని అరెస్టు చేసి, నిజాం ప్రభుత్వం దాశరథికి 16 నెలల కఠిన కారాగార శిక్షను విధించింది. కొన్ని నెలలు వరంగల్ జైల్లో ఉంచి, తరువాత దాశరథిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు పంపింది. నిజామాబాద్ జైల్లో దాశరథి ముఖం కడుక్కునే బొగ్గుతో జైలు గోడ మీద

**"ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజుకు మాకెన్నడేని తీగెలను తెంపి, అగ్నిలో దింపినావు నాతెలంగాణ కోటి రత్నాల వీణ"** అని రాస్తే జైలు అధికారులు తుడిచి వేయించారు. అపుడు అదే జైల్లో ఉన్న వట్టికోట ఆళ్వారు స్వామి, మళ్లీ మళ్లీ గోడ మీద రాసేవారు.

జైల్లో దాశరథి స్వామి రామానంద తీర్థను దర్శించు కొన్నారు. స్వామీజీ దాశరథి సాహసాన్ని ప్రశంసించినారు .

**"నా తెలంగాణ తల్లి కంజాతవల్లి" -"నా తెలంగాణ కోటి అందాల జాణ" - "నా తెలంగాణ సీమ సౌందర్య సీమ"- "నా తెలంగాణ కోటి రత్నాల వీణ"** అంటూ తెలంగాణ తల్లిని వేనోళ్లా ప్రశంసించిన తెలంగాణ ముద్దు బిడ్డ దాశరథి. "తెలంగాణలోని కోటి ధీరుల గళధ్వనినె గాక ఇలా గోళ మందుండెడి ఎల్లరి శబ్దాన్ని నేను నా పేరు ప్రజాకోటి నా ఊరు ప్రజావాటి" అని చాట గలగిన ప్రపంచ ప్రజాకవి దాశరథి.

**"అగ్నిధార"** మొదలు 'నేత్రపర్వం' దాకా ముప్పైకి పైగా, గ్రంథాలు రచించారు దాశరథి. 200 కు పైగా చలన చిత్రగీతాలు రాశారు. దాశరథిని గూర్చి అనేక విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి.

ఆయన రచనలు అనేక భాషలలోనికి అనువాదిత మైనాయి. తెలుగులో గజల్ రుబాయీ ప్రక్రియలను, ప్రప్రథమంగా ప్రవేశ.పెట్టిన ప్రయోక్త దాశరథి మహాకవే.

'జాతీయోద్యమ రథసారథిగా' భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేతుల మీదుగా తామ్రపత్ర సన్మానాన్నీ, అప్పటి ఉప రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్ చేతుల మీదుగా సన్మానాన్ని అందు కొన్నారు దాశరథి. 'కళాప్రపూర్ణ', 'డి.లిట్' వంటి గౌరవ పట్టాలతో వివిధ విశ్వ విద్యాలయాలు దాశరథిని సన్మానించాయి. అమెరికా తెలుగు వాళు ' ఆంధ్ర కవితా సారథి' గా సన్మానించారు.

ఒంగోలు ' గండపెండేరం ' తొడిగి సన్మానించింది. వరంగల్లు దాశరథికి స్వర్ణోత్సవం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 లో ఆస్థానకవిగా నియమించి సన్మానించింది. అనేక దేశాలలో పర్యటించి , దాశరథి తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను గూర్చి ప్రసంగించారు. దాశరథి అనారోగ్యానికి గురై 1987 నవంబరు 5 వ తేదీ ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## బాచుపల్లి వద్ద కారు బోల్తా.. నాలుగేళ్ల చిన్నారి సహా ముగ్గురు దుర్మరణం



సంగారెడ్డి, జులై 21: (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కల్హేర్ మండలం బాచుపల్లి వద్ద ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో నాలుగేళ్ల చిన్నారి సహా ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు.

విదేశాల నుంచి వస్తున్న బంధువును తీసుకొచ్చేందుకు నాందేడ్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. యాక్సిడెంట్ గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## కేసీఆర్ ఒక్కో రైతుకు వెంటనే రూ.5 లక్షలు ప్రకటించాలన్నారు : కేటీఆర్



హైదరాబాద్, జులై 21: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు.

ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు.

## నూతన మురికి కాలువ నిర్మాణానికి శ్రీకారం

నిజామాబాద్, జులై 21: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని చేంగల్ గ్రామంలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న నూతన మురికి కాలువ నిర్మాణ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ దుమాల మమత (రాజు) ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ఈ కాలువ నిర్మాణం దోహదపడుతుందని, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.

గ్రామస్తులు మాట్లాడుతూ, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.

ఈ పనుల కోసం కృషి చేసిన సర్పంచ్ దుమాల మమత, ఉపసర్పంచ్ నాతి మోహన్ గౌడ్, పాలకవర్గ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్, వార్డు సభ్యులు రజిత, రవి, పురస్థపు దిలీప్, మంద గంగాధర్, కారోబార్ చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో సర్పంచ్ తండ్రి మృతి.. మెదక్ జిల్లా పొడ్చెన్‌పల్లిలో విషాదం

మెదక్, జులై 21: (నేటినిజం ప్రతినిధి): మెదక్ జిల్లాలో విషాదం నెలకొంది. పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చెన్‌పల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై సర్పంచ్ తండ్రి మరణించాడు.

కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సర్పంచ్ వెంకటయ్య (యేసు) తండ్రి ఏరోళ్ల కిష్టయ్య (56) మంగళవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న సంప్ నుంచి మోటార్ ద్వారా పైకి నీటికి ఎక్కించబోయాడు. అయితే సోమవారం రాత్రి వర్షం కారణంగా మోటార్ తడిసి ఉంది. ఈ క్రమంలో మోటార్ ఆన్ చేయగానే కిష్టయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇది గమనించి కుటుంబసభ్యులు వెంటనే మెదక్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కిష్టయ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించాడని తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## నూతన మురికి కాలువ నిర్మాణానికి శ్రీకారం

నిజామాబాద్, జులై 21: నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని చేంగల్ గ్రామంలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న నూతన మురికి కాలువ నిర్మాణ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ దుమాల మమత (రాజు) ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ఈ కాలువ నిర్మాణం దోహదపడుతుందని, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.

గ్రామస్తులు మాట్లాడుతూ, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ పనుల కోసం కృషి చేసిన సర్పంచ్ దుమాల మమత, ఉపసర్పంచ్ నాతి మోహన్ గౌడ్, పాలకవర్గ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్, వార్డు సభ్యులు రజిత, రవి, పురస్థపు దిలీప్, మంద గంగాధర్, కారోబార్ చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ బీడీ తయారీపై చర్యలు తీసుకోవాలి.. బీడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్

రాజన్న సిరిసిల్ల, జులై 21:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా బీడీలు తయారు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొందరు నగదు పేరుతో బీడీల తయారీ చేపట్టి కార్మికులకు తక్కువ కూలి చెల్లిస్తున్నారని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి కార్మిక సంక్షేమ సదుపాయాలు కల్పించకుండా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని కూడా ఎగ్గొడుతున్నారని పేర్కొన్నారు.

అక్రమంగా బీడీలు తయారు చేయడం వల్ల కార్మికులు ఉపాధి, సంక్షేమ ప్రయోజనాలు కోల్పోతుండటంతో పాటు, చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బీడీ కంపెనీలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. అందువల్ల జిల్లాలో లైసెన్స్ లేకుండా బీడీలు తయారు చేస్తున్న సంస్థలపై, అలాగే ఒక కంపెనీ లైసెన్స్‌తో మరో కంపెనీ పేరుతో బీడీలు తయారు చేస్తున్న వారిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## అర్హులందరికీ వెంటనే కార్డులు ఇవ్వాలని డిమాండ్..



రాజన్న సిరిసిల్ల, జులై 21:(నేటినిజం ప్రతినిధి): అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యానికి నిరసనగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టి యు డబ్ల్యు జే హెచ్143) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం భారీ విజయాన్ని సాధించింది. జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు నాయకత్వంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ, అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హులైన జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయాణ సౌకర్యాలు, ఇతర అధికారిక గుర్తింపు ప్రయోజనాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరు నెలల్లో బస్సు పాస్‌ను ఆరుసార్లు రెన్యువల్ చేయించుకోవాల్సిన దుస్థితి రావడం తెలంగాణ జర్నలిస్టు సమాజాన్ని అవమానించే చర్యేనని మండిపడ్డారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం భారీ వర్షంలోనూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఏమాత్రం మంచిది కాదని హెచ్చరిస్తూ, ప్రభుత్వం ఇకనైనా స్పందించి అర్హులందరికీ వెంటనే పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి అక్కడికి చేరుకుని నాయకుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ... జై జై తెలంగాణ", "జోహార్ తెలంగాణ జర్నలిస్టు అమరవీరులు", "వుయ్ వాంట్ జస్టిస్", "అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి" అంటూ జర్నలిస్టులు నినాదాలు చేయడంతో కలెక్టరేట్ ప్రాంతం మారుమోగింది.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ , ప్రింట్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

### -స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్




రాజన్న సిరిసిల్ల, జులై 21:(నేటినిజం ప్రతినిధి): జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలపై స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పోలీస్ శాఖ, జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన పనులపై ఆరా తీసి.. భవిష్యత్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వైద్యాధికారి ఏంజెలాగ్లోరి, ఆర్అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, పోలీస్, నేషనల్ హై వే అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.